ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 44.0
కనిష్ఠం : 27.0

ఎందుకిలా!

గోదావరి తీరాన తొలిసారి మారిన సీను


ఎందుకిలా... ఒక నిర్దిష్ట నిర్ణయం జరిగిన తర్వాత పదే పదే అవాంతరాలు ఎందుకు తలెత్తున్నాయి. కేడర్‌లో గజిబిజికి దారితీస్తున్న పరిస్థితులు ఏమిటి. సీనియర్లు కాదంటున్నా త్యాగం పేరిట తప్పట్లేదా.. అన్నింటి కంటే మించి నామినేషన్లకు ముందు కూడా ఎందుకీ సందిగ్ధం, మరెందుకీ సందేహాలు. ఒకప్పుడు రాజకీయాల్లో ముక్కుసూటితనం ఉండేది. రానురాను ప్రత్యర్థి ఎత్తుగడకు దీటుగా మార్పులు, చేర్పులు చేస్తుండడమే ఈ ఎన్నికల్లో రోజు తలెత్తున్న సస్పెన్షన్.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

చాన్నాళ్ల క్రితం ఏలూరు ఎంపీ స్థానం ఎవరికి కేటాయించబోతున్నారంటూ దాదాపు మూడు వారాలకు పైగానే అందరిని గందరగోళంలోకి నెట్టింది. జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు సొంత నియోజకవర్గమైన ఉంగుటూరు పొత్తులో భాగంగా గన్ని చేజారుతుందా.. అంటూ మరికొన్నాళ్ల పాటు సోషల్ మీడియాలో పుంఖాను పుంఖాలుగా సందేహాలకు దారి తీసింది. ఆ తర్వాత నూజివీడులో సీటు ఎవరికంటూ మరో సస్పెన్షన్. ఇదంతా కూటమిలో భాగస్వాములైన పార్టీల మధ్య నామినేషన్ల ముందు వరకు సాగిన వ్యవహారం కేడర్‌ను కదిలించింది. మరోవైపు వైసీపీ పక్షాన ఇలాంటి జాతరే. ఏలూరులో ప్రస్తుత సిట్టింగ్‌ను కాదని వేరొకరికి అవకాశం ఇస్తారా, చింతలపూడిలో సిట్టింగ్ ఎమ్మెల్యే తిరుగుబాటుతో ఆ పార్టీ నాయకత్వం కాస్తంతైనా తలొగ్గకపోతుందా... పోలవరంలో ప్రకటించిన అభ్యర్థి కుల వివాదంతో తలెత్తిన వ్యవహారం ఒక కొలిక్కి వస్తుందా. ఇలాంటి సందేహాలెన్నో రోజుల తరబడి ఆయా నియోజక వర్గాల్లో సెగలు పొగలు సృష్టిం చాయి. ప్రత్యేకించి ఈసారి ఆరునూరైనా సరైన విజయం తమ వైపే ఉండాలనే ఆకాంక్ష, నిరంతరం సాగిన సర్వేలు, సీట్ల సర్దుబాటు పేరిట కూటమిలో ఉమ్మడి త్యాగాలకు సిద్ధపడడం వంటి పరిణామాలన్నీ కలబోసి కొన్నాళ్ల పాటు అనిశ్చితికి దారితీసింది.

- రోజుకోసారి మార్పు చేర్పులతో టెన్షన్
- అభ్యర్థిత్వాలు ఖరారైన తర్వాతా గందరగోళం
- ఈసారి అన్ని పార్టీల్లోను సయోధ్య లోపం
- అభ్యర్థులు, కేడర్‌కు మానసిక శాంతి కరువు
- ఆజ్యం పోస్తున్న సోషల్ మీడియా





కూటమికి బాలారిష్టాలు

సాధారణంగా గడిచిన రెండు సాధారణ ఎన్నికల్లో ఈ పరిస్థితి లేదు. ప్రత్యేకించి ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో టీడీపీకి స్పష్టత ఉండేది. ఒక్క వైసీపీలోనే వ్యవహారం ఊగిస లాడేది. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల మధ్య సమతూకానికి ఆ పార్టీ నాయకత్వం ప్రయత్నించినప్పుడు ఈ సమస్యే కాకుండా అంతర్గత వివాదాలు చోటు చేసుకునేవి. కానీ మునుపెన్నడూ లేనివిధంగా అధికార వైసీపీని ఓటమి పాలు చేయాల్సిందేనని సంకల్పబలంతో ముందుకొచ్చిన కూటమి కొంత బాలరిష్టాలను ఎదుర్కొంది. తప్పు ఒప్పులను సవరించుకుని ఏ వైరుధ్యం లేకుండా ఉమ్మడి విజయమే ఆకాంక్షగా అడుగు లేస్తోంది. పోలవరం నియోజకవర్గంలో పొత్తుల్లో భాగంగా జనసేనకు సీటును కేటాయించారు. ఆది నుంచి ఇది కొందరికి మింగుడు పడక పోవడం, ఇంకొందరికి ఉత్సాహాన్ని ఇచ్చింది. పరస్పర సమన్వయంతో చర్చించుకోవా ల్సిందే తప్ప వీధిన పడితే సహించేదే లేదని కూటమిలో అందరికి ముందస్తు హెచ్చరికలే పంపారు. రానురాను సర్దుకుపోయే గుణం చూపించారు. మళ్లీ తిరిగి అక్కడ వ్యవహారం మొదటికొచ్చింది. ఏవో కారణాలతో పరస్పరం నిందించుకోవడం, రగిలిపోవడం వంటి చర్యలకు దిగారు. ఇదే తరుణంలో పోలవరం వైసీపీ అభ్యర్థి కుల వ్యవహారం న్యాయస్థానం ముందుకు వెళ్లింది. ఆ పార్టీ అభ్యర్థి తప్పుడు కుల ధ్రువీకరణ పంపారంటూ అది ఏమాత్రం చెల్లదని సవాలు చేస్తూ కొందరు కోర్టు గడప తొక్కారు. దాదాపు పక్షం రోజుల పాటు తీవ్ర అలజడికి దారితీసింది. ఈ మధ్యనే ఆ వ్యవహారం న్యాయ స్థానంలో విచారణకొచ్చి వాయిదా పడడంతో వైసీపీ కాస్త ఊపిరి పీల్చుకుంది.

ఏలూరు ఎంపీ స్థానంలోను..

ఏలూరు ఎంపీ స్థానంలోనూ ఇదే తంతు. ఏలూరు ఎంపీ స్థానాన్ని బీసీలకు కేటాయిస్తామని తెలుగుదేశం మొదటి నుంచి ప్రకటిస్తూనే వచ్చింది. ఆ దిశగానే అభ్యర్థి అన్వేషణలోనూ పడింది. వేరే సామాజిక వర్గాలకు చెందిన సీనియర్లు ఈ స్థానం వైపు చూసినా టీడీపీ అధి నేత చంద్రబాబు ససేమిరా కాదని బీసీ అభ్యర్థిగా పుట్ట మహేష్ కుమార్ యాదవ్‌ను రంగంలోకి దింపారు. ఆయన అభ్యర్థిత్వాన్ని షెడ్యూల్ విడుదలకు కొద్దిరోజుల ముందే ప్రకటించారు. అప్పటి నుంచి ఏలూరు లోక్‌సభ స్థానం కోసం బీజేపీ ప్రయత్నిస్తున్నట్టుగా, ఆ పార్టీ పక్షాన తపన చౌదరి పోటీకి సిద్ధమైనట్టు చిలువలు పలువలుగా ప్రచారం సాగింది. లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ తీవ్ర చర్చే సాగింది. దీనిని ఖండిస్తూ తమ అభ్యర్థి పుట్ట మహేష్ అని టీడీపీ అభ్యర్థుల జాబితా ప్రకటిం చింది. అయితే బీజేపీ ఎక్కడా వదలకుండా ఈ స్థానంపై తమ దృష్టే ఉందని, దానిని నుంచి తప్పించబోరని ప్రచారా నికి దిగింది. ఇది కూడా టీడీపీలో అసహనానికి దారి తీసింది.

నూజివీడు, కైకలూరులోను రచ్చ..

నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గంలో సీటు మార్పిడి జరిగినప్పుడు టీడీపీ కేడర్ గందరగోళంలో పడగా సమాంతరంగా అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే మేకా ప్రతాప అప్పారావు వ్యవహారంలోనూ వైసీపీ నాయకత్వం మరో ఆలోచనే చేస్తున్నట్టు ప్రచారం దుమారంలా సాగింది. కైకలూరులోనూ ఈ తరహా పరిస్థితే. ఆఖరికి కాంగ్రెస్‌లోనూ అభ్యర్థుల ప్రకటన వెలువడే వరకూ ఆ తర్వాత కూడా మార్పులు చేర్పులు ఉంటాయంటూ ఆ నోటా ఈ నోటా సాగిన ప్రచారం ఇంకో దుమారమైంది.

ఇప్పుడా వంతు దెందులూరు..

దెందులూరు టీడీపీ అభ్యర్థిగా చింతమనేని ప్రభాకర్ పేరును టీడీపీ తమ రెండో జాబితాలో ప్రకటించింది. మొదటి విడత జాబితాలో ప్రభాకర్ పేరు ఉంటుందని అందరూ ఊహించినా ఎందుకో అది సాధ్యం కాలేదు. రెండో విడతలో ప్రకటన వచ్చేంత వరకూ రకరకాల ప్రచారాలు అటు చింతమనేనిని, ఇటు తెలుగుదేశం కేడర్‌ను అశాంతికి గురి చేశాయి. గడిచిన మూడు రోజులుగా మళ్లీ కథ మొదలకొచ్చింది. చింతమనేని ప్రభాకర్‌కు టీడీపీ ముఖ్యులతో సాన్నిహిత్యం ఉంది. దీనికి తోడు మాస్‌లో ప్రత్యేక గుర్తింపు కలిగిన లీడరుగా పేరుంది. ఎన్నికల ముందు కూడా పార్టీ అధినేత చంద్రబాబు ఇదే విషయాన్ని బహిరంగ వేదికలపైన తేల్చి చెప్పేవారు. ఇక్కడ నెలకొన్న గందరగోళానికి తెర దించుతూ అందరి మాదిరిగానే ఈనెల 21వ తేదీన బీ-ఫారం అందుకోవడానికి టీడీపీ కేంద్ర కార్యాలయానికి రావాల్సిందిగా శుక్రవారం మధ్యాహ్నం చింతమనేనికి పార్టీ వర్గాల ద్వారా సమాచారం అందింది. ఆలోపే సీటు మారుస్తున్నారంటూ బీజేపీ వైపు నుంచి పెద్దఎత్తున ప్రచారం సాగగా ఎటు తేల్చుకోలేక జనం అనిశ్చితికి గురయ్యారు. ప్రత్యేకించి ఇదే దెందులూరు నియోజకవర్గం వైసీపీలోనూ ఇలాంటి తగాదాలే ఉన్నట్లు సోషల్ మీడియాలోనూ కొంతసేపు ప్రచారం సాగింది. ఇలా రకరకాలుగా నిర్ణయం ఒకవైపు, మార్పులు, చేర్పులు పేరిట సాగిన ప్రచారాలు ఈ ఎన్నికల సమయంలో సరికొత్త ట్రెండుగానే భావిస్తున్నారు. అయితే పార్టీ కేడర్, అభ్యర్థుల సానుభూతి పరులు తీవ్ర మానసిక అశాంతికి గురయ్యారు.

నామినేషన్ కౌంటర్ (2వ రోజు)

ఎంపీ/ఎమ్మెల్యే నియోజకర్గాలు	రెండో రోజు నామినేషన్లు	మొత్తం
ఏలూరు ఎంపీ	02	03
1.ఉంగుటూరు	01	01
2.దెందులూరు	01	02
3.ఏలూరు	00	01
4.పోలవరం	00	02
5.చింతలపూడి	00	00
6.నూజివీడు	01	03
7.కైకలూరు	03	03
మొత్తం	06	12
నరసాపురం ఎంపీ	04	05
1.ఆచంట	04	04
2.పాలకొల్లు	04	04
3.నరసాపురం	02	02
4.భీమవరం	01	01
5.ఉండి	04	04
6.తణుకు	04	04
7.తాడేపల్లిగూడెం	02	02
మొత్తం	21	21



ఆర్వో ఖాజావలికి నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు (జనసేన)

రెండో రోజు ఎనిమిది నామినేషన్లు

ఏలూరు పార్లమెంట్‌కు రెండు, అసెంబ్లీ నియోజక వర్గాలకు 6 దాఖలు

ఏలూరు సిటీ/ ఏలూరు కలెక్టరేట్/ ఉంగుటూరు/దెందులూరు/కైకలూరు/ నూజివీడు ఏప్రిల్ 19 : ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు పార్లమెంట్ స్థానానికి రెండు, జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి ఆరుగురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కావూరి లావణ్య, స్వతంత్ర అభ్యర్థిగా బొక్కినాల కోటేశ్వరరావు ఒక్కొక్క సెట్ చొప్పున కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఉంగుటూరు కూటమి అభ్యర్థిగా పత్సమట్ల ధర్మరాజు (జనసేన) రిటర్నింగు అధి కారి ఖాజావలికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందించారు. దెందులూరు వైసీపీ అభ్యర్థిగా కొఠారు అబ్బయ్య చౌదరి ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వో లావణ్య వేణికి అందించారు. కైకలూరు కాంగ్రెస్ అభ్యర్థిగా బొడ్డు నోయల్, జీవన్ డానియెల్ నోబుల్ బొడ్డులు ఒక్కొక్క సెట్ చొప్పున, జైభీమ్‌రావు భారత్ పార్టీ తరపున గొంతువులుగు సతీష్‌కుమార్ ఒక సెట్ నామినేషన్లు రిటర్నింగ్ అధికారి భాస్కర్‌కు అందజేశారు. ట్రావెలర్స్ బంగ్లా నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు జాతీయ రహదారిపై బారికేడ్లు పెట్టి ఇతరులు లోనికి రాకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బొడ్డు నోబుల్ కైకలూరులోని అతని నివాసం నుంచి సుమారు 2వేల మంది కార్యకర్తలతో ఊరేగింపుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. నూజివీడు వైసీపీ అభ్యర్థిగా మేకా ప్రతాప్ అప్పారావు ఒక సెట్ నామినేషన పత్రాలను సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో వై.భవాని శంకరికి అందించారు. 23న అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా మరోసెట్‌ను దాఖలు చేయను న్నారు. కాగా ఏలూరు, చింతలపూడి, పోలవరం నియోజక వర్గాలకు సంబంధించి రెండో రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.



ఉండి ఎమ్మెల్యే అభ్యర్థిగా రఘురామ పేరిట ఆయన సతీమణి రమాదేవి నామినేషన్ పత్రాలను ఆర్వోకు సమర్పించారు

ఉండి ఎమ్మెల్యేగా పోటీ చేస్తా : ఎంపీ రఘురామ

భీమవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున ఉండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆ దిశగా నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నట్టు ఆయన ఏబీఎన్-ఆంధ్రజ్యోతికి వివరించారు. తనకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే శివరామరాజులను స్వయంగా కలిసి మద్దతు కోరతానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగనుండడంతో పలువురు నాయకులు, కార్యకర్తలు రఘురామకృష్ణంరాజును మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

సోషల్‌మీడియాపై ప్రత్యేక నిఘా : ఎస్పీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 19 : ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున సోషల్ మీడియా మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలను, ట్రోలింగ్‌లను తీవ్రంగా పరిగణిస్తామని ఎస్పీ మేరీ ప్రశాంతి హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టామని, ఎనిమిది అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లాల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటలు తనిఖీలు చేస్తున్నామన్నారు. ప్రజలు, పార్టీ నేతలు సోషల్ మీడియా వాడకంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా తప్పుడు ప్రచారాలు చేసినా, మెస్సేజ్‌లను ఫార్వర్డ్ చేసినా తీవ్రంగా పరిగణించి కేసులు నమోదు చేస్తామన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

ప్రకటనలకు అనుమతి తప్పనిసరి : కలెక్టర్

ఏలూరు సిటీ, ఏప్రిల్ 19 : పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు రాష్ట్ర / జిల్లా స్థాయిలో ఎంసీఎంసీ కమిటీల అనుమతి లేకుండా ప్రింట్ మీడియాలో ఎలాంటి రాజకీయ ప్రకటనలను ప్రచురించకూడదని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. రాజకీయ ప్రకటనల విషయంలో ఎంసీఎంసీ కమిటీల నుంచి ముందస్తుగా అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే ప్రింట్ మీడియాలో ప్రకటనలు ప్రచురించాలన్నారు.

ప్రత్యేక పరిశీలకులుగా ముగ్గురు ఐఆర్‌ఎస్ అధికారులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 19 : ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంతమైన వాతావరణంలో స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి సత్వర చర్యలు చేపట్టడానికి జాతీయ ఎన్నికల కమిషన్ ముగ్గురు ఐఆర్‌ఎస్ అధికారులైన పి.కీర్తి నారాయణ్ (చెన్నై), టిషేరింగ్ జార్డర్ భూతియా (వెస్ట్ బెంగాల్), మోస్రం గౌరవ్ మధుకర్ (మహారాష్ట్ర)లను జిల్లాకు ప్రత్యేక పర్యవేక్షకులుగా పంపించింది. ఈ ముగ్గురు అధికారులు శుక్రవారం ఎస్పీ మేరీ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందించారు. జిల్లాలో తీసుకున్న చర్యలను ఎస్పీ వివరించారు. ఏఎస్పీ స్వరూపరాణి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు మల్లేశ్వరరావు, ఆది ప్రసాద్ ఉన్నారు.



ఎస్పీ మేరీ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలను అందిస్తున్న ఐఆర్‌ఎస్ అధికారులు

పరిమితికి మించి ఖర్చు చేస్తే అనర్హత వేటు

ఏలూరు సిటీ/ఉంగుటూరు/దెందులూరు, ఏప్రిల్ 19 : ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గరిష్ట పరిమితికి మించి ఖర్చు చేస్తే అనర్హుల వుతారని, ఎన్నికల వ్యయంపై అభ్యర్థులు అవగాహన కలిగి ఉండాలని నియోజక వర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు మేశ్రం గౌరవ్ మధుకర్ (ఐఆర్‌ఎస్) తెలిపారు. శుక్రవారం ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అభ్యర్థుల వ్యయానికి సంబంధించి ఏలూరు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఉంగుటూరులో పర్యటించి రిటర్నింగ్ అధికారి ఖాజావలి, ఏఆర్వో వెంకట శివయ్య, ఎంపీడీవో కార్యాలయ సిబ్బందిని ఎన్నికల వ్యయంపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ కార్యక్రమాన్ని అబ్జర్వర్ గౌరవ్ పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి, జేసీ లావణ్యవేణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

3,500 కేజీల రేషన్ బియ్యం పట్టివేత



మునునూరు, ఏప్రిల్ 19: మండలంలోని రమణక్కపేటలో భారీగా రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఏలూరు జిల్లా ఏఎస్‌వో ప్రతాప్‌రెడ్డి, డీఎస్‌వో సత్యనారాయణరాజు, నూజివీడు పీడీఎస్ డీటీ జి.వెంకటేశ్వరరావు రమణక్కపేటకు చెందిన కొడాలి వంశీకృష్ణ ఇంటివద్ద బోలేరో వాహనంలో అక్రమంగా ఉన్న రేషన్ బియ్యాన్ని దాడి చేసి పట్టుకున్నారు. 3,500 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీటీ వెంకటేశ్వరరావు తెలిపారు. నిందితుడు వంశీకృష్ణను విచారించగా, తిరువూరుకు చెందిన చారి, విజయవాడకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రరావు, గుంటూరుకు చెందిన మానురాజు కృష్ణదీప్‌లు ద్వారా ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం నుంచి ఈ రేషన్ బియ్యాన్ని తీసుకు వచ్చినట్లు తెలిపాడని డీటీ తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి, పట్టుబడిన బియ్యాన్ని దుకాణం-2 డీలర్‌కు అప్పగించినట్టు ఆయన తెలిపారు. వంశీకృష్ణతోపాటు మరో ముగ్గురిపై పోలీసులకు డీటీ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వాసు తెలిపారు.



ప్రచారంలో పాల్గొన్న పత్సమట్ల ధర్మరాజు, గన్ని వీరాంజనేయులు, మాలతీరాణి

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన జగన్

- ఉంగుటూరు కూటమి జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు


ఉంగుటూరు, ఏప్రిల్ 19 : రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి అభివృద్ధిని మరచి పోయిన జగన్‌ను గద్దె దింపాలని జనసేన ఉంగుటూరు అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ఓటర్లకు పిలుపునిచ్చారు. ఉంగుటూరు మండలం కంసాలిగుంట, యర్రమిల్లిపాడు గ్రామాల్లో శుక్రవారం జనంలోకి జనసేన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అభ్యర్థులను గెలిపించి సంక్షేమం, అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అసెంబ్లీ స్థానానికి గాజు గ్లాసుకు, ఏలూరు పార్లమెంటు స్థానానికి సైకిల్‌పై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మహిళలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఆయన వెంట టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, మండల జనసేన అధ్యక్షుడు పి.రాంబాబు, ఇల్లిందల సురేష్, కంసాలిగుంట సర్పంచి ముంద్రు శాంతి, జనసైనికులు, తెలుగుదేశం నాయకులు వేములపల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 19 : మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని ఒక వ్యక్తిపై ఇద్దరు నాపరాయితో దాడి చేసి కొట్టి హత్య చేసినట్టు నేరం రుజువు కావడంతో వారిద్దరికి పదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రెండు వేల రూపాయలు జరిమానా విధిస్తూ ఏలూరులోని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తమకుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఏలూరు తంగెళ్ళమూడి మసీదు ప్రాంతానికి చెందిన సయ్యద్ అబ్దుల్ అజీమ్ పిప్పిపళ్ళ వైద్యం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. 2017 మే 8వ తేదీ మధ్యాహ్నం సయ్యద్ అబ్దుల్ అజీమ్ తన ఇంటికి వెళ్తుండగా తంగెళ్ళమూడి ప్రాంతంలోని తన ఇంటికి వెళ్లే దారిలో అదే ప్రాంతానికి చెందిన సియ్యాల రంగా, రెడ్డి నాగరాజు అడ్డగించి మద్యానికి డబ్బులు ఇవ్వాలని అడిగారు. అజీమ్ డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో పక్కనే డ్రెయిన్‌పై ఉన్న నాపరాయి తీసుకుని అతన్ని కొట్టి డ్రెయిన్‌లో పడవేశారు. ఈ సమాచారం అందుకున్న అతని కుమార్తె షేక్ రసీమున్నీసా వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. టూటౌన్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ బంగార్రాజు కేసు నమోదు చేయగా ఆ తర్వాత సీఐ మధుబాబు కేసు దర్యాప్తు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు జిల్లా కోర్టులో విచారణ సాగింది. నిందితులైన సియ్యాల రంగా, రెడ్డినాగరాజులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి పదేళ్ల జైలు, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తమకుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొనేరు సీతారామ్‌రావ్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు టూటౌన్ సీఐ ఎం.ప్రభాకర్, ఎస్‌ఐలు సాదిక్, మదీనా బాషా, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, కోర్టు కానిస్టేబుల్ చిరంజీవి సహకరించారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ప్రత్యేక దృష్టి సారించి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న ట్రైల్ కేసులలో త్వరితగతిన, సకాలంలో కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టడం, బాధితులకు సత్వర న్యాయం అందించడానికి చర్యలు తీసుకున్నారు. కేసులో నిందితులకు శిక్షలు పడేలా కోర్టు మానిటరింగ్ సెల్ విధులను నిర్వర్తించింది. దీంతో వారందరినీ ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు.

జిల్లాలో వాహనాల తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 19 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లజాము వరకూ జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ జాతీయ, రాష్ట్రీయ రహదారులపై తనిఖీలు నిర్వహించారు. నాటుసారా, నగదు, మద్యం, గంజాయి రవాణా జరుగకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టారు. అంతేకాకుండా వివిధ నగరాలు, పట్టణాలు, వివిధ ప్రాంతాల్లో ఏటీఎంలు, మసీదులను గస్తీ పోలీసులు పరిశీలన చేశారు. లాడ్జీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలోని అనుమానాస్పద వ్యక్తులను పరిశీలించారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా రూ.5,900 విలువైన 20.95 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీల్లో రూ.5లక్షల 5వేల 400 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రూ.1,85,000 నగదు స్వాధీనం

ఉంగుటూరు, : ఉంగుటూరులో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్విలెన్స్ టీంల తనిఖీలలో శుక్రవారం ఇద్దరి నుంచి రూ.1,85,000ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఒకరి నుంచి రూ.85,000, మరో వ్యక్తి రావులపాలెంకి చెందిన పర్వత వర్ధనరావు నుంచి రూ.1,00,000 నగదు స్వాధీనం చేసుకున్నారు.



ప్రజాగళంలో పాల్గొన్న ఏలూరు కూటమి జనసేన అభ్యర్థి బడేటి చంటి

ప్రజల భవిష్యత్తు కోసమే కూటమి

- ఏలూరు కూటమి టీడీపీ అభ్యర్థి బడేటి చంటి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 19: ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేందుకే కూటమి ఏర్పడిందని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా 22వ డివిజన్‌లో శుక్రవారం పర్యటించారు. టీడీపీ కూటమి అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి తప్పితే గత ఐదేళ్లలో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. కూటమికి వస్తున్న ప్రజాదరణ చూస్తుంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎప్పుడు జగన్ పీడ వదిలిపోతుందా.. అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే బడేటి కోట రామారావు సతీమణి రేణుకమ్మ, చంటి సతీమణి మీనా, కొట్టు మధు వెంకట్రావు, కొట్టు మనోజ్, లక్ష్మీ, ఎం.చంద్రశేఖర్, కోటేశ్వరమ్మ, మధ్యాహ్నపు ఈశ్వరి, బలరామ్ దంప తులు, జనసేన ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు వికసిత భారత్ జిల్లాస్థాయి పోటీలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19 : వికసిత భారత్ -భవిష్యత్‌లో భారతదేశం విజన్ అనే అంశంపై 'ప్రేరణ ఉత్సవ్' పేరిట సమగ్రశిక్ష జిల్లా కార్యాలయ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని బాలబాలికలకు ఇటీవల జరిగిన వ్యాసరచన, చిత్రలేఖనం, గేయాల పోటీల విజేతలతో జిల్లాస్థాయి పోటీలను శుక్రవారం జవహర్ నవోదయ విద్యాలయలో నిర్వహించినట్టు ఎస్ఎస్ఏ జిల్లా ఏపీసీ బి.సోమశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి పోటీల నుంచి మొత్తం 30 మందిని ఎంపిక చేశామని, వీరినుంచి ఒక బాలుడు, బాలికను ఎంపిక చేసేందుకు తుది ఇంటర్వ్యూ నిర్వహించి వారు సాధించిన మార్కులను ప్రేరణ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఎంపికైనవారిని గుజరాత్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీకి ఆంధ్రప్రదేశ్ నుంచి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించేలా పంపిస్తామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతే జాతీయస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించిన పోటీలు శనివారం ఇక్కడే జరుగు తాయన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లానుంచి జాతీయ పోటీలకు తుదిగా ఎంపికైన నలుగురు విద్యార్థులు, ఇద్దరు టీచర్ల వివరాలు రెండురోజుల్లో ప్రకటించే అవకాశం ఉందన్నారు. జిల్లాస్థాయి పోటీలకు న్యాయనిర్ణేతలుగా జవహర్ నవోదయ విద్యాలయ టీచర్లు, కేంద్రీయ విద్యాలయ అధ్యాపకులు వ్యవహరించారు. జేఎన్‌వీ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సమగ్రశిక్ష ఏఎంవో ఆర్.రామారావు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

జగన్మాయ





తాగునీరు ఇస్తామన్నారు భీమవరం రహదారి నిర్మిస్తామన్నారు

మాట తప్పారు

భీమవరం నియోజకవర్గంలో తీర గ్రామాలు, వీరవాసరం మండలంలో పలు గ్రామాల దప్పిక తీరుస్తామని హామీలు గుప్పించారు. యనమదుర్రు డ్రెయిన్‌పై కోట్ల రూపాయలతో నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మిస్తామని గొప్పలు చెప్పారు. చూస్తుండగానే ఐదేళ్లు గడిచిపోయాయి. ఏ హామీ నెరవేరలేదు. డ్రెయినేజీల మురుగు, గ్రామాల్లో చెత్త సమస్యల కూడా పరిష్కారం కాలేదు. హామీలు నెరవేర్చని పాలకులు మరోసారి ఓటర్ల ముందుకు వస్తున్నారు.

- తీరంలో తాగునీటి తిప్పలు
- యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనకు మోక్షం లేదు
- గ్రామాల్లో చెత్త సమస్య

(భీమవరం రూరల్, వీరవాసరం)

చేసిన పనులు లేకపోయినా ప్రభుత్వం అభివృద్ధిపై గొప్పలు చెబుతోంది. ఎంతో చేసేశామని ప్రజా ప్రతినిధుల హడావుడి.. తీరా నియోజకవర్గంలో తీర ప్రాంతం దాహంతో అలమటిస్తూ కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. స్వచ్ఛమైన తాగునీరందిస్తామన్న పాలకులు పత్తా లేరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హామీలు ఏమయ్యాయి. ఎన్నాళ్లీ తాగునీటి తిప్పలు అంటూ వాపోతున్నారు. వీరవాసరం మండల కేంద్రంలో సుమారు 20 వేల మంది జనాభా. గ్రామంలో నికి ప్రధాన సమస్య డ్రెయినేజీ. చెరువులు ఉన్నప్పటికీ సరైన తాగునీరు లేదు. దీనికితోడు గ్రామంలో టన్నుల కొద్దీ చెత్తా చెదారాన్ని వేయటానికి డంపింగ్ చేయటానికి స్థలం లేక రహదారి మార్జిన్‌వే వేసి పోగపెడుతున్నారు. గొంతేరు డ్రెయిన్ చేర్చి ఉన్న సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకొని సంపద కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇది ప్రధాన రహదారికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో చెత్త సేకరణ వాహనాలు అక్కడికి వెళ్లడం లేదు. చెత్తను జాతీయ రహదారి పక్కన గొంతేరు డ్రెయిన్ సమీపంలో ఉన్న సుమారు 45 సెంట్ల ప్రభుత్వ స్థలంలో వేస్తున్నారు.

మండలంలో లక్షల వ్యయంతో నిర్మించిన సంపద కేంద్రాల లక్ష్యం నీరుగారింది. 23 గ్రామాలకు 18 గ్రామాలలో సంపద కేంద్రాలు ఏర్పాటయ్యాయి. లక్షల నిధులు నిరుపయోగం కాగా మత్స్యపురిలో సంపద కేంద్రం సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణానికి సిటింగ్ రూంగా మారింది.

వీరవాసరం మండలం రాయకుదురులో తాగునీటి చెరువు ఆధునీకరణ, పంట కాలువ నుంచి చెరువు వరకూ ప్రత్యేక పైపులైన్‌కు రూ.40లక్షల అంచనా రూపొందించారు. ఐదేళ్లు గడిచి పోయాయి. తాగునీటి చెరువు వృథా చెరువే.



కలుషిత నీరు తెస్తున్న లోసరి కాల్వ



వీరవాసరంలో డ్రెయిన్ల నిర్మాణ శిలాఫలకం



వీరవాసరంలో రోడ్డు పక్కన చెత్త



కలుషిత నీరే గతి

కుళాయిలో కలుషిత నీరు వస్తుంది. వాటర్ ప్లాంట్ నీరు పైనే ఆధారపడాల్సి వస్తుంది. టిన్నులతో పట్టుకు వెళ్తాను.
నాగరాజు, దొంగపిండి



తాగునీటికి తిప్పలు

తాగునీటి తిప్పలు తప్పడం లేదు. కుళాయి నీరు తాగలేం. వాటర్ ప్లాంట్ నీరు తెచ్చుకొంటాం. ఏడాదంతా ఇదే సమస్య.
సీతమ్మ, లోసరి గ్రామం



ఎందుకీ వంతెనలు

వంతెన నిర్మించి ఉపయోగం లేదు. ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నాం. అప్రోచ్ రోడ్డు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి.
నాగరాజు, తోకతిప్ప



జారిపోతున్నాం

వంతెనకు ఇరువైపులా రహదారి వేసుకున్నాం. వర్షాకాలం మోటార్ సైకిళ్లు జారి ప్రమాదాలకు గురవ్వాల్సి వస్తుంది.
శ్రీనివాస్, తోకతిప్ప

తీరుం గొంతెండుతోంది

భీమవరం మండలంలో తీరప్రాంత గ్రామాలైన లోసరి, దొంగపిండి, కొత్తపూసలమర్రు గ్రామాల్లో కలుషిత నీరే దిక్కు. ఆ నీరు తాగలేక ప్రైవేటు ప్లాంట్ల నుంచి నీరు కొనుగోలు చేసుకుంటున్నారు. లోసరి మెయిన్ కాలువ చెత్త తొలగింపు పనులు చేపట్టకపోవడం.. నీరు దిగువకు చేరలేని పరిస్థితి నెలకొంది. దీంతో లోసరి, దొంగపిండి, కొత్తపూసలమర్రు, గ్రామ మంచి నీటి పథకాలు చెరువులు నింపాలంటే కష్టసాధ్యంగా మారింది. దానికితోడు ఫిల్టర్ బెడ్‌ల మరమతులకు నిధులు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. స్వచ్ఛమైన నీరు రాకవడం లేదు. ఇదంతా ప్రభుత్వం, ప్రజాప్రతినిదులు వైఫల్యమేనని ప్రాంత ప్రజలు అంటున్నారు.

చెరువులున్నా.. సమస్యే..

వీరవాసరంలో తూర్పుచెరువు, ఎల్లమ్మ చెరువు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పేరుతో పీర్లకోడు చెరువులు ఉన్నాయి. వీటి ద్వారా రెండు రక్షిత నీటి సరఫరా పథకాలు పనిచేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామం అంతటికీ తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీరు కొన్ని ప్రాంతాలకు శుద్ధి చేసే నీరు అందగా మరికొన్ని ప్రాంతాలకు మురుగు నీరే సరఫరా అవుతుంది. తాగునీటి కోసం ప్రజలు ప్రైవేట్ వాటర్ ప్లాంట్లపై ఆధారపడుతున్నారు. పంచాయతీ పరిధిలో నాందీ ఫౌండేషన్ ద్వారా తూర్పుచెరువు వద్ద ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ ప్రైవేట్‌కే అప్పగించారు. చినదళితపేటలో రావివారి చెరువు వద్ద సుజల పేరుతో 20 లీటర్ల నీరు తక్కువ ధరకే సరఫరా చేసేలా పీతల హిట్లర్ ఫౌండేషన్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. దీనిని ఎప్పుడో మూతవేశారు. గ్రామంలో ఎక్కడికక్కడ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటుచేసి నీటి విక్రయాలు చేస్తున్నారు. పంచాయతీ పరంగా మాత్రం తాగునీరు సమస్యగానే మిగిలింది. ప్రతి నిత్యం ఏడులక్షల లీటర్ల నీరు నీటి సరఫరా పథకాల ద్వారా పంపిణీ అవుతున్న గ్రామస్తుల దాహార్తి తీరడం లేదు.

రాయకుదురు మంచినీటి చెరువుగట్టుపై 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్ఎస్ఆర్ ఫిల్టర్ బెడ్లు ఉండేవి. మావుళ్లమ్మ ఆలయం సమీపంలో మరో ఓహెచ్ఎస్ఆర్ నిర్మించి బోర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. చెరువుగట్టుపై ఒహెచ్ఎస్ఆర్ ఫిల్టర్‌బెడ్‌లను తొలగించారు. ఫిల్టర్‌బెడ్ లోని నీరు శుద్ధి కాకపోవడంతో బోరు నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారు. సమీపంలో రొయ్యల సాగుతో చెరువు నీరు కలుషితమవుతోంది.

మాట ఇచ్చారు.. ఫలితం లేదు

మాట ఇచ్చారు కానీ ఫలితం లేదు. అంచనా వేయాలన్నారు.. నిధులు వచ్చాయన్నారు.. టెండర్ వేసిన ఎవరూ రాలేదంటున్నారు.. యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు అప్రోచ్ రోడ్డు పరిస్థితి ఇది. రహదారిని నిర్మాణానికి ఐదేళ్ల క్రితం ఇచ్చిన హామీ గాలికొదిలేశారు. ఇప్పటికి రహదారులు ఏర్పాటు లేకపోవడం వంతెనలు నిరుపయోగంగా ఉన్నాయి. అప్పట్లో యనమదుర్రు డ్రెయిన్‌పై తోకతిప్ప, గొల్లవానితిప్ప, పట్టణ పరిధిలోను మూడు చోట్ల ఒక్కో వంతెన రూ.4.5 కోట్లుతో నిర్మాణం చేపట్టారు. దాదాపు ఆరేళ్ల దాటుతున్నా వంతెనలకు ఇరువైపులా రహదారులు లేవు. రెండు వంతెనలకు గ్రామస్తులే ర్యాంపులు వేసుకుని నడవడం రెండు చక్రాల వాహన ప్రయాణం సాగిస్తున్నారు. ఒక వంతెన శిథిలావస్థకు చేరిన వంతెనలా మారింది. ఈ ప్రభుత్వం హాయంలో ఇరువైపులా రహదారులకు రూ.36 కోట్లు మంజూరు చేసింది. అలా వచ్చి ఏడాది అయిన టెండర్లు పిలవడం ఎవరూ ముందుకు రాలేదనడంతో పనులు ప్రారంభంకాని వంతెనలుగా మారాయి. ఇదంతా ప్రభుత్వం లోపమేనని నిర్వాసితులు నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

నీటి డ్రెయిన్లు..?

వీరవాసరంలో డ్రెయినేజీ సమస్యను తీర్చడానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. దీనికోసం రూ 14.10 కోట్లు అంచనా విలువతో ఉపాదిహామీ పథకం నుండి నిధులు మంజూరు చేయించారు. 2019 డిసెంబరులో అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. డ్రెయిన్లను నిర్మించి, వాటిని మేజర్ డ్రెయిన్ గొంతేరు లో కలిపేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించారు. గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్యశాఖ డ్రెయినేజీ నిర్మాణాలను చేపట్టింది. గ్రామంలో మొత్తం 47 డ్రెయినేజీలను నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. 2020లో కరోనా కారణంగా నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. అనంతరం నిధులు మురిగిపోయాయి. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ పరిష్కారం కాకుండా నిలిచిపోయింది. దీనిని ముందుకు తీసుకువెళ్ళేందుకు తదుపరి చర్యలు లేకపోవటంతో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. ప్రధాన డ్రెయిన్ నిర్మాణం లేకుండా పలు వీధుల్లో ఇటీవల డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టారు. ఈ నీరు త్రాగునీటి వనరుల ఉతీసుకువెళ్ళే పీర్లకోడు ఛానల్‌లో కలుస్తుందని గ్రామస్తులు ఆందోళన చేసినా పట్టించుకోలేదు.



చందాలివ్వండి... లేదంటే కేసులే

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

అధికార పార్టీలో ఆయన రాష్ట్రస్థాయి పదవి అనుభవిస్తున్న నేత. వాణిజ్య కేంద్రమైన నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అన్ని సంఘాలతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. మెకానిక్ అసోషియేషన్ సంఘ భవనానికి రూ.5 లక్షల విరాళం ఇచ్చారు. నేతది ఎంత మంచి మనసో అంటూ సభ్యులు అనుకున్నారు. పట్టణంలో మరికొన్ని సంఘాలకు సొమ్ములు ఇస్తానంటూ సంకేతాలు పంపారు. అంతా అబ్బా అనుకున్నారు. కానీ సదరు నేత చందాలు వసూళ్లకోసం ఇస్తున్న ఆదేశాలతో ఇప్పుడంతా నోరెళ్ల బెడుతున్నారు. స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తో సమావేశమయ్యారు. ఏకంగా కోటి రూపాయలు విరాళం ఇవ్వాలని ఆదేశించారు. బిల్డర్స్‌ను పిలుస్తున్నారు. ఎన్నిలకు చందాలు ఇవ్వాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. వ్యాపార, వాణిజ్య సంఘాలు, ఆర్థికంగా బలోపేతంగా ఉన్న వ్యాపారులను పిలిపిస్తున్నారు. చందాలు అడుగుతున్నారు. లేదంటే భవిష్యత్‌లో కేసులు తప్పవంటూ సంకేతాలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమదే నంటూ బెదాయిచేస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పుడిదే హాట్ టాపిక్‌గా మారింది. తనకు మద్దతు ఇవ్వడం లేదని వేరే పార్టీలో చేరుతున్నారంటూ కొందరికి మున్సిపాలిటీ నుంచి నోటీసులు జారీ చేశారు. భవన నిర్మాణాల్లో అతిక్రమణలు చేశారంటూ తాజాగా నోటీసులు వెళ్లాయి. గతంలో అదే భవన యజమానుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసుకున్నారు.



సోమనాద్రిపురం అగ్రహారంలో వలంటీర్లతో వైసీపీ నేతల సమావేశం

రాజీనామా చేయండి..

- వైసీపీ తరపున పనిచేయాలి
- వలంటీర్లపై ఒత్తిడి
- మండవల్లి మండలంలో రహస్య సమావేశం

మండవల్లి, ఏప్రిల్ 19: వలంటీర్ వ్యవస్థతోనే ఎన్నికల నిర్వహణ చేపట్టాలన్న వైసీపీ ప్రభుత్వం ఆలోచన బెడిసికొట్టడంతో వలంటీర్లను పూర్తిస్థాయిలో ఎన్నికల నిర్వహణలో వినియోగించుకోవాలన్న ఎత్తుగడలో అధికార పార్టీ నేతలు ఉన్నారు. వలంటీర్లు ఎన్నికల నిర్వహణ విధుల్లో పాల్గొనరాదని కోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్నప్పటికి వారిని వినియోగించుకుని ఎన్నికల్లో లబ్ధి పొందాలని వైసీపీ నేతలు వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నారు. మండవల్లి మండలంలో వలంటీర్ల సమావేశాన్ని శుక్రవారం మధ్యాహ్నం రహస్యంగా నిర్వహించారు. ఇప్పటికే కొంతమంది వలంటీర్లతో వైసీపీ నాయకులు బలవంతంగా రాజీనామాలు చేయించినప్పటికీ మిగిలిన వారు కూడా రాజీనామా చేసి ఎన్నికల్లో వైసీపీ విజయానికి దోహదపడాలని కొందరు నేతలు ఒత్తిడి చేయడం చర్చనీయంశమైంది. రానున్నది వైసీపీ ప్రభుత్వమని, ప్రత్యేక నోటిఫికేషన్‌తో రాజీనామా చేసిన వలంటీర్లు అందర్నీ విధుల్లోకి తీసుకుంటామంటూ హామీ ఇస్తున్నట్లు తెలిసింది. రాజీనామా చేసిన వలంటీర్లకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేసే యోచన ఉన్నట్లు చెబుతున్నారు. వినకపోతే భయపెట్టి రాజీనామా చేయించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇదంతా సమావేశ హాల్‌లో ఒక యువకుడు వీడియో తీస్తుండగా వైసీపీ సర్పంచ్ దాడి చేసినట్లు తెలిసింది.

అత్తిలిలో 270 మంది రాజీనామా

అత్తిలి: మండలంలో వలంటీర్లు రాజీనామాకు వైసీపీ నేతలు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకుల జోక్యంతో మండలంలోని 407 మంది వలంటీర్లకు 270 మంది రాజీనామా చేసినట్లు సమాచారం. మరో పక్క టీడీపీ నేత అధినేత చంద్రబాబు వలంటీరు వ్యవస్థపై ఇస్తున్న భరోసాతో కొందరు పునరాలోచనలో పడ్డారు. రాజీనామాకు ససేమిరా అంటున్నారు. అధికార పార్టీ నేతలు మాత్రం వారిపై ఒత్తిడి పెంచుతున్నారు. వలంటీరు సన్నిహితులతో చెప్పిస్తున్నారు. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న యువతకు వలంటీర్లుగా అవకాశం కల్పించింది. వలంటీర్లను ఎన్నికల్లో వాడుకునే యోచనలో నేతలు ఉన్నారు. కొందరు వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో నాయకుల వెంట తిరుగుతున్నారు. మిగిలిన వారిని కూడా రాజీనామా చేయాలని ఒత్తిడి పెంచుతున్నారు. పై స్థాయి నేతల ఆదేశాలతో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు వలంటీర్ల రాజీనామాకు పట్టుబడుతున్నారు. రాజీనామా చేసి మీ పరిధిలోని కుటుంబాల వద్దకు వెళ్లండి, వైసీపీకి ఓట్లు వేసేలా చూడండి, అధికారంలోకి రాగానే తిరిగి మిమ్మల్లే వలంటీర్లుగా తీసుకుంటామంటూ ఆశ చూపుతున్నారు. మరోవైపు చంద్రబాబు భరోసాతో వలంటీర్లు రాజీనామాకు వెనుకంజ వేస్తున్నారు. అక్కడక్కడ మాత్రమే అధికార పార్టీ నేతలు ఒత్తిడిని తట్టుకోలేక మాత్రమే అయిష్టంగా వైదొలుగుతున్నారు.

గోదారి దాటి.. కొండ ఎక్కి.. దిగి..



ఓటేయడానికి ఎన్ని కష్టాలో..

ఏజెన్సీ మారుమూల ప్రాంతం వారు ఓటు వేయాలంటే గోదావరి దాటాలి.. తర్వాత కొండ ఎక్కి దిగి 40 కిలో మీటర్లు నడవాల్సిందే. వేలేరుపాడు మండలం కొయిదా పంచాయతీ పరిధిలో కాకవిసనూరు గ్రామం ఉండగా కొండరెడ్డి గిరిజనులు నివాసం ఉంటున్నారు. గ్రామంలో సుమారు 60 కుటుంబాల్లో 120 మందికి పోలవరం నియోజకవర్గంలో ఓటు ఉంది. ఈ గ్రామం పోలింగ్ కేంద్రానికి 40 నుంచి 50 కిలో మీటర్లు దూరంలో ఉంది. వారంతా బోటు లేదా లాంచిలో ప్రయాణించి గోదావరి దాటి కొండలు ఎక్కి దిగి పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. వారంతా ఓటుహక్కును వినియోగించుకోడానికి ఏర్పాట్లు చేశామని, ప్రత్యేకంగా ఒక బోటు సిద్ధం చేశామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ తెలిపారు.

- బుట్టాయగూడెం



నామవరంలో మాట్లాడుతున్న అప్పటి సీఎం చంద్రబాబు (ఫైల్)

చింతలపూడి నుంచే ఉమ్మడి అటవీ యాజమాన్య పథకం

రాష్ట్రంలో అడవుల సంరక్షణ, చెట్ల పెంపకంలో పేదలను సభ్యులుగా చేసే ఉమ్మడి అటవీ యాజమాన్య పథకాన్ని 1992లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చింతలపూడి నియోజకవర్గం నామవరం వద్ద బర్రికొండ ఫారెస్ట్‌లో ప్రారంభించారు. రాష్ట్రంలో అడవుల సంరక్షణ, సంపద పెంచడానికి ఈ ఉమ్మడి యాజమాన్య పథకాన్ని తీసుకువచ్చి వన చంద్రోదయం పేరుతో ఒక పైలాన్ ఆవిష్కరించారు. ఈ పథకం వన సంరక్షణ పథకం పేరుతో రాష్ట్రమంతటా కొనసాగుతూనే ఉంది. ఇందులో వేలాది మంది పేదలు సభ్యులుగా, అటవీశాఖ సంయుక్తంగా అడవులను పెంచి ఆ సంపదను ఉమ్మడిగా అనుభవిస్తారు.

- చింతలపూడి



చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఆ కళాశాల బోర్డు చూస్తే.. ఎన్టీఆర్ గుర్తుకు వస్తారు

చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల చూస్తే ఎన్‌టిఆరే గుర్తుకు వస్తారని కళాశాలలో మొదటి బ్యాచ్ విద్యార్థులు ఇప్పటికి చెబుతుంటారు. 1987 సెప్టెంబర్‌లో చింతలపూడి దుర్భిక్షప్రాంతం చూడడానికి వచ్చిన ఎన్టీఆర్ బహిరంగ సభలో మాట్లాడుతూ తన పర్యటనకు గుర్తుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వారంరోజులు తిరగకుండా కళాశాల తరగతులను ప్రారంభించారు. తొలుత స్థానిక జూనియర్ కళాశాలలోని షిఫ్ట్ పద్ధతిలో తరగతులు నిర్వహించారు. మొదటి బ్యాచ్ విద్యార్థులు ఇప్పటికి ఈ కళాశాలను చూసినప్పుడల్లా ఎన్‌టీఆర్‌ను గుర్తుకు తెచ్చుకుంటారు. ఆ రోజుల్లో డిగ్రీ చదవాలంటే ఏలూరు వెళ్లాల్సి వచ్చేది. ఆర్థికభారంతో ఎందరో విద్యార్థులు ఇంటర్‌తో చదువులు నిలిపివేసేవారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుతో ఉన్నత చదువు అందుబాటులోకి వచ్చింది. కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థులు ఈ కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులుగా మరింత కృషిచేస్తున్నారు.

- చింతలపూడి



ఈ ఖర్చు.. దాటొద్దు

అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై ఎన్నికల కమిషన్ నిఘా వేస్తుంది. ప్రచారం, సభలు, ర్యాలీలు తదితర కార్యక్రమాలపై ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎప్పటికప్పుడు లెక్కలు తీస్తారు. క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలిస్తారు. మరి ఆ ఖర్చును ఎలా లెక్కిస్తారు. దీనికి ఎన్నికల కమిషన్ ధరలు నిర్ణయించింది. ఎన్నికలలో అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను వివిధ విభాగాలుగా విభజించి ధరలు నిర్ణేశించారు. ఆ ధరల ప్రకారమే ఎన్నికల వ్యయాన్ని చూపాల్సి ఉంటుంది. వివిధ విభాగాల్లో ధరలు ఈవిదంగా ఉన్నాయి.

- వాటర్ ప్రూఫ్ వేదిక అయితే(4నుంచి 6 అడుగులు) చదరపు అడుగుకు రూ.35, అదే సైజ్ సాధారణ వేదిక యితే చదరపు అడుగుకు రూ.25
- చేతుల కుర్చీ ఒక్కింటికి రూ. 8, సాధారణ కుర్చీ రూ.5, ఐరన్ టేబుల్ (1వెడల్పు , 6 ఎత్తు అడుగులు ఉంటే రూ.30, గ్రీన్ కార్పెట్ చ.అ. రూ. 4, రెడ్ కార్పెట్‌కు చదరపు అడుగుకు రూ.4
- 9 నుంచి 18 అడుగుల షామియానాకు రూ.300, 12 నుంచి 24 అడుగుల షామియానా రూ. 500, 18 నుంచి 18 అడుగుల షామియానా రూ. 500, 18 నుంచి 36 అడుగులు రూ. 1500, 36 నుంచి 36 అడుగుల షామియానా రూ. 3500, 54 నుంచి 54 అడుగుల జంబో షామియానా రూ. 4000, సైడ్ వాల్స్ 6నుంచి 7 అడుగుల ఎత్తు వరకు చదరపు అడుగుకు రూ.15
- ఐరన్ స్టెప్స్‌కు 3.5 అడుగులకు రూ.2వేలు. స్టీల్ చైర్‌కు రూ.30, స్టీల్ సోఫాకు రూ.500, మహారాజా సింగిల్ చైర్‌కు రూ. వెయ్యి, మహారాజా డబుల్ చైర్ రూ.2000, ఫాన్ ఒక్కింటికి రూ.200.
- ఫ్లెక్సీ బ్యానర్‌కు చదరపు అడుగుకు రూ.20, పైప్ పెండల్స్‌కు చదరపు అడుగుకు రూ.8. సౌండ్ సిస్టమ్ ప్రత్యేకమయితే రూ.20వేలు, సాధారణమయితే రూ. 15 వేల చొప్పున లెక్కిస్తారు.
- డ్రమ్‌లు, డస్టుబిన్‌లకు ఒక్కింటికి రూ.50, వీఐపీ చైర్స్ ఒక్కింటికి రూ.100, బారికేడ్ ఐరన్ ఆర్ఎఫ్‌టి రూ.80. స్టీల్ సోఫా విత్ కవర్ రూ.500, వీఐపీ సోఫా విత్ కవర్‌కు రూ.800. ఐరన్ టేబుల్ విత్ క్లాత్‌కు ఒక్కింటికి రూ.80
- పాంప్లెట్స్ , పోస్టర్‌లకు 3వేల కాపీలకు రూ.2242 నుంచి రూ. 35 వేలు. ఓటర్ స్లిప్‌లు సింగిల్ కలర్ లక్ష కాపీలకు రూ.29,500. కలర్ పాంప్లెట్స్, పోస్టర్‌లకు సైజుల వారీగా రూ. 1 నుంచి రూ.10. క్లాత్ బాడ్జీలకు ఒక్కింటికి రూ.25, ఫ్లెక్సీ ప్లాస్టిక్ చదరపు అడుగుకు రూ.15, క్లాత్ ఫ్లెక్సీ రూ.35, ఆటో స్టిక్కర్‌కు అడుగుకు రూ.30, క్యాప్ ఒక్కింటికి రూ.45, టి షర్ట్ ఒక్కింటికి రూ.180.
- వీడియో, ఫొటో షూట్ ఇతరాలకు రూ.354 నుంచి రూ.11,800. ఆడియో వాయిస్ రికార్డింగ్‌కు రూ.12,390 నుంచి రూ.24,780. సీడీ పెన్ డ్రైవ్‌కు 60 నిమిషాలకు రూ.12,390, 2 గంటలు అయితే రూ.17,700. ఎల్ఇడి స్క్రీన్స్‌కు అవుట్‌డోర్ ఎస్ఎఫ్‌టికి రూ.342, ఇండోర్ ఎస్ఎఫ్‌టికి రూ.240.
- రిఫ్రెష్‌మెంట్స్‌లో టిఫిన్స్‌కు రూ.25 నుంచి 40, టీ/కాఫీకి రూ. 8/15. స్నాక్స్‌కు రూ.5 నుంచి రూ.60, కర్డ్ రైస్ రూ.60, సాధారణ భోజనం / ప్రత్యేక భోజనానికి / బిరియానీ/ నాన్ విజ్ బిరియానీకి రూ.80 నుంచి రూ.280.
- వాటర్ ప్యాకెట్‌కు ఒక్కింటికి రూ.3, వాటర్ బాటిల్ రూ. 10 నుంచి రూ.12, మినరల్‌వాటర్ బాటిల్ రూ.15 నుంచి రూ.28.
- హోటల్ సింగిల్ రూమ్ ధర రూ.500 - రూ.5599, డబుల్ రూమ్ రూ.1680 - రూ.6159.
- హైరింగ్ వాహనాలు ఆటో, టాక్సీ అయితే రూ.310 - రూ. వెయ్యి (రోజుకు), మిగిలిన వాహనాలకు రూ.1500 - రూ.3450. ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్ళకు కూడా ధరలు నిర్ణయించారు. డ్రైవర్ బేటా కూడా రోజుకి రూ. 300 నుంచి రూ. 767.
- క్లాత్ బ్యానర్ రూ.260, క్లాత్ జెండా రూ.65, ప్లాస్టిక్ జెండా రూ.41.

- ఏలూరు సిటీ


నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం

ఫ్లాష్ బ్యాక్

ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు పశ్చిమగోదావరి, ప్రస్తుతం తెలంగాణలో ఉన్న ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట వంటి ప్రాంతాలు నూజివీడు సంస్థానంలో భాగంగా ఉండేది. దాదాపు 14 పరిగణాలుగా ఉన్న ఈ నూజివీడు సంస్థానం స్వాతంత్ర్య అనంతరం మూడు జిల్లాలుగా విభజితమైంది. అనంతరం ఈ సంస్థానం దాదాపు 20 నియోజకవర్గాలుగా విభజితమైంది స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లాలో నూజివీడు డివిజన్ (14 మండలాలతో) అతిపెద్ద డివిజన్‌గా ఉండేది. జాతీయ స్థాయిలో శాశించిన ప్రముఖులకు ఈ నూజివీడు నియోజకవర్గం జన్మభూమి అంటే అతిశయోక్తి కాదు. నూజివీడు కేంద్రంగా నూజివీడు సంస్థానేతగా పేరుగాంచిన మాజీ మంత్రి, ఆంధ్రా యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎమ్మార్ అప్పారావుతో పాటు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మాజీ రాజ్యసభ సభ్యులు దాసరి నాగభూషణరావు, రైతు సంఘం జాతీయ నాయకులు కొల్లి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు, మాజీ మంత్రి, దివంగత ఎమ్మెల్సీ పాలడుగు వెంకట్రావు వంటి దిగ్గజాలు ఈ నియోజకవర్గం వారే.



భారత స్వాతంత్ర్య సమరంలో నూజివీడు సంస్థానం ప్రముఖపాత్ర పోషించింది. ఉద్యమాల పురిటిగడ్డగా ఒకానొక దశలో కమ్యూనిజం భావాలతో భూదానోద్యమం కేంద్రంగా నిలిచింది. నూజివీడు నియోజక వర్గంలో నూజివీడు మున్సిపాల్టీతో పాటు ముసునూరు, ఆగిరిపల్లి, నూజివీడు మండలంతో పాటు పాత నియోజకవర్గంలో బాపులపాడు మండలంలోని కొన్ని ప్రాంతాలు అంతర్భాగంగా ఉండేవి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అనంతరం బాపులపాడు మండలంలోని గ్రామాలు గన్నవరం నియోజకవర్గంలో విలీనం కాగా తిరువూరు నియోజకవర్గం నుంచి చాట్రాయి మండలాన్ని నూజివీడు నియోజకవర్గంలో విలీనం చేశారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గం నాలుగు మండలాలు, ఒక మున్సిపాల్టీతో 2,37,139 మంది ఓటర్లను కలిగి ఉంది. ఇందులో పురుషులు 1,17,398 మంది కాగా, మహిళలు 1,19,730 మంది, ఇతరులు 11 మంది ఉన్నారు.
- నూజివీడు

ఉద్ధండుల కోట

మహామహులు ఏలిన నూజివీడు


నూజివీడు కోటగుమ్మం

అన్ని పార్టీలకు ఆదరణ

955 నుంచి ఉమ్మడి కృష్ణాజిల్లాలో నూజివీడు నియోజకవర్గం అంత ర్యాగంగా ఉంది. ఈ నియోజకవర్గం దాదాపు అన్ని పార్టీలను సమానంగా ఆద రించిందని చెప్పవచ్చు. తొలితరం కాంగ్రెస్ పార్టీ నుంచి శాసనసభ్యులు ఎన్నిక కాగా తదుపరి తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తరువాత ఈ నియోజకవర్గం తెలుగుదేశానికి కంచుకోటగా ఉంది. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అనం తరం చాట్రాయి మండలం ఈ నియోజకవర్గంలో చేరడంతో కొన్ని రాజకీయ సమీకరణాలు మారి తిరిగి ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రాబల్యం పెరిగింది. దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి చనిపోయిన తరువాత కాంగ్రెస్ స్థానాన్ని ఇక్కడ వైసీపీ భర్తీ చేయడంతో వైసీపీ ప్రాబల్యం కనిపిస్తోంది. తొలిసారిగా నూజివీడు సంస్థానాదీశుడు అయిన మేకా రంగయ్య అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన 1955 నుంచి 1978 వరకు శాసనసభ్యుడిగా పనిచేయగా, ఈ కాలంలో ఆయన రాష్ట్రమంత్రిగా కూడా వ్యవహరించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కోటగిరి హనుమంతురావు ఇక్కడ చక్రం తిప్పారు. తొలుత 1983లో ఈయన ఇక్కడ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలిచి, తెలుగుదేశం పార్టీలో చేరారు. అక్కడి నుంచి ఆయన దాదాపు 15 సంవత్సరాల పాటు తెలుగుదేశం శాసన సభ్యుడిగా పనిచేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పాలడుగు వెంకట్రావు చక్రం తిప్పగా ఈయన సైతం రెండు పర్యాయాలు శాసన సభ్యుడిగా, ఒక పర్యాయం విధాన సభకు ప్రాతినిధ్యం వహించడమే కాక మంత్రిగా కూడా పనిచేశారు. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో కీలకపాత్ర వహించిన మేకా ప్రతాప్ తన రాజకీయ గురువు అయిన కోటగిరి హనుమంతు రావుతో విభేదించి 1994లో తొలిసారి ఇక్కడి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి శాసనసభ్యునిగా గెలుపొందారు.అనంతరం వైసీపీలో చేరి వరుసగా రెండుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. దాదాపు 15 సంవత్సరాల పాటు శాసనసభ్యుడిగా కొనసాగారు. మధ్యలో 2009లో ఒకసారి తెలుగుదేశం పార్టీ నుంచి డాక్టర్ చిన్నం రామకోటయ్య ఇక్కడి నుంచి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. నూజివీడు సంస్థానాదీశుడు ఎమ్మార్ అప్పారావు అత్యధికాలం 22 సంవత్సరాల పాటు శాసన సభ్యునిగా కొనసాగగా, చిన్నం రామకోటయ్య మినహా మిగిలిన వారు దాదాపు మూడుసార్లు ఇక్కడి నుంచి అధికారంలో ఉన్నారు.

నూజివీడు నియోజకవర్గ వ్యాప్తంగా 286 పోలింగ్ స్టేషన్లు ఉండగా, నూజివీడు మున్సిపల్ పరిధిలో 48, నూజివీడు రూరల్ మండలపరిధిలో 71, ముసునూరు మండలపరిధిలో 57, చాట్రాయి మండలపరిధిలో 51, ఆగిరిపల్లి మండలపరిధిలో 59 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. నూజివీడు నియోజకవర్గ పరిధిలో మొత్తం పోలింగ్‌స్టేషన్లు 286గా ఉంది.

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు	ప్రత్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
1955	మేకా రంగయ్య అప్పారావు	ఏకగ్రీవం				
1962	మేకా రంగయ్య అప్పారావు	కాంగ్రెస్	35,244	దాసరి నాగభూషణరావు	సీపీఐ	21,235
1967	మేకా రంగయ్య అప్పారావు	కాంగ్రెస్	36,468	తిరువూరు మధుసూదన్‌రావు	స్వతంత్ర	28,294
1972	మేకా రంగయ్య అప్పారావు	కాంగ్రెస్	36,689	మాదల వెంకటేశ్వరరావు	స్వతంత్ర	27,564
1978	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	40,524	విద్యుత్ కుమార్ అప్పారావు	ఆర్-కాంగ్రెస్	37,270
1983	కోటగిరి హనుమంతురావు	స్వతంత్ర	30,267	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	25,924
1985	కోటగిరి హనుమంతురావు	టీడీపీ	50,282	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్)	46,688
1989	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	60,378	మేకా రంగయ్య అప్పారావు	టీడీపీ	56,784
1994	కోటగిరి హనుమంతురావు	టీడీపీ	63,202	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	50,377
1999	కోటగిరి హనుమంతురావు	టీడీపీ	46,139	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	42,670
2004	మేకా ప్రతాప్ అప్పారావు	కాంగ్రెస్	80,706	కోటగిరి హనుమంతరావు	టీడీపీ	61,499
2009	చిన్నం రామకోటయ్య	టీడీపీ	70,206	మేకా ప్రతాప్ అప్పారావు	కాంగ్రెస్	65,063
2014	మేకా ప్రతాప్ అప్పారావు	వైసీపీ	95,565	ముద్దరబోయిన వెంకటేశ్వరరావు	టీడీపీ	85,168
2019	మేకా ప్రతాప్ అప్పారావు	వైసీపీ	1,01,950	ముద్దరబోయిన వెంకటేశ్వరరావు	టీడీపీ	85,740

ప్రపంచ ప్రసిద్ధి..నూజివీడు మామిడి



ప్రపంచంలో ఏ మూలకువెళ్ళినా నూజివీడు మామిడికి ఉన్న చారిత్రక ప్రసిద్ధి మరువలేం. పచ్చని మామిడితోటలతో అలరాడే ఈ ప్రాంతం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత మెట్ట ప్రాంతం. ఈ ప్రాంతంలో మామిడి పరిశోధనా కేంద్రంతో పాటు ఉద్యానవన పాలిటెక్నిక్ కళాశాలతో ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం లభిస్తోంది. ప్రతి సీజన్‌లో అనేక వేలటన్నులు మామిడి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు తరలివెళుతోంది. దీంతో పాటు ఆధ్యాత్మిక ప్రాంతంగా ఈ ప్రాంతం అలరారుతోంది. ఆగిరిపల్లి శ్రీ వ్యాఘ్రలక్ష్మి నరసింహస్వామి దేవస్థానం, మరోవైపు ముసునూరు మండలంలోని బలివే రామలింగేశ్వరస్వామి, నూజివీడు మండలంలోని గొల్లపల్లి రఘునాథ స్వామిదేవస్థానం, చాట్రాయి మండలం చనుబండ కోదండరామస్వామి దేవాలయం వంటి పురాతన దేవాలయాలు నూజివీడు ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువస్తున్నాయి. దీంతోపాటు ఈ ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లు అనటంలో అతిశయోక్తి లేదు. నూజివీడు ప్రాంతం నుంచి బాస్కెట్‌బాల్,వాలీబాల్, టెన్నీకాయిట్ వంటి క్రీడాంశాల్లో ప్రావీణ్యం సాధించారు. ఏ ప్రాంతానికి వెళ్ళినా ఇక్కడి వారు ఉపాధి, ఉద్యోగ రంగాల్లో స్థిరపడిన వారిని చూడవచ్చు.

అభ్యర్థుల ఆస్తిపాస్తుల చిట్టా

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కీలకమైన నామినేషన్ పత్రాల స్వీకరణ మొదలైంది. శుక్రవారం అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు వారి ఆస్తుల వివరాలతో అఫిడవిట్‌లు సమర్పించారు.

ఆచంట : పితాని సత్యనారాయణ (టీడీపీ)



వయసు : 71 సంవత్సరాలు
విద్యార్హత : డిగ్రీ (బీకాం)
కేసులు : రెండు ఉన్నాయి
బ్యాంక్ బ్యాలెన్స్ : రూ.36 లక్షలు
భార్య అనంతలక్ష్మి పేరున : 9 లక్షలు
ఆస్తులు : రూ. 10.73 కోట్లు
భార్య పేరిట : రూ. 3.51 కోట్లు
అప్పులు పితాని పేరిట రూ. 2.72 లక్షలు

ఆచంట : చెరుకువాడ శ్రీరంగనాథరాజు (వైసీపీ)



వయసు : 70
విద్యార్హత : 9వ తరగతి
బ్యాంక్ బ్యాలెన్స్ : రూ.20.46 లక్షలు
భార్య పేరున : రూ. 17.53 లక్షలు
చరాస్థులు : రూ. 3.80 కోట్లు
భార్య పేరిట రూ. 9.56 కోట్లు
అప్పులు : రూ. 16 కోట్ల 46 లక్షలు

తాడేపల్లిగూడెం : బొలిశెట్టి శ్రీనివాస్ (జనసేన)



వయసు : 62
విద్యార్హత: బీకాం
కేసులు : నాలుగు
చరాస్తులు: రూ.15 కోట్ల 92 లక్షల 65 వేలు
భార్యపేరున: 7,08,950
స్థిరాస్తి : రూ. 6 కోట్ల 4 లక్షల 45 వేలు
భార్య పేరున : రూ.2,27,83
బంగారం విలువ: రూ.3,40,250, భార్యపేరున : 6,80,500
అప్పులు: రూ.17 కోట్ల 18 లక్షలు
కియా కారు, ఇతర వాహనాల విలువ: రూ.98.92 లక్షలు

నరసాపురం : ముదునూరి ప్రసాదరాజు (వైసీపీ)



వయసు : 50
విద్యార్హత : ఇంటర్
చరాస్థులు :రూ. 57.72 లక్షలు
స్థిరాస్తులు రూ. 59.41 లక్షలు
సొంత ఇంటి విలువ :రూ.29.26 లక్షలు
బంగారం విలువ : రూ. 7.08 లక్షలు
అప్పులు : రూ. 1 కోటీ 83 లక్షల 90 వేలు
రెండు కార్లు : రూ. 36.04 లక్షలు
సతీమణి శారదాదేవి పేరుతో చరాస్తులు : రూ..62.11 లక్షలు, బంగారం: రూ.35.75 లక్షలు, వెండి: రూ.3.60 లక్షలు
అప్పులు రూ. 12.38 లక్షలు
వాహనాల విలువ రూ. 25.35 లక్షలు

తణుకు : ఆరిమిల్లి రాధాకృష్ణ (టీడీపీ)



వయసు : 50
విద్యార్హతలు : ఎంఎస్‌సి
కేసులు : ఏడు ఉన్నాయి
చరాస్థులు : 4,22,80,548
భార్య పేరిట : 6.28, కోట్లు
స్థిరాస్తి : 14. 49 కోట్లు
భార్య పేరిట : 4.03 కోట్లు
సొంతింటి విలువ : 2.42 కోట్లు
బంగారం విలువ : 20,80,00,భార్య పేరున : 1,27,09,500
అప్పులు : 1,12,98,454, భార్య పేరన : 13,28,832
వాహనాలు : టాటా సఫారి రూ.4,29,653, ఫోర్డు ఎండీవర్- రూ.18,46,394, భార్య పేరున బెంజ్ కారు రూ. 28,11,144

తణుకు : కారుమూరి నాగేశ్వరరావు (వైసీపీ)



వయసు : 59
విద్యార్హత : 7వ తరగతి
చరాస్తులు : 94.75 లక్షలు
భార్య పేరున : 1.35 కోట్లు
స్థిరాస్తి : 6.57 కోట్లు
భార్యపేరున : 19.17 కోట్లు
సొంతింటి విలువ : 4 కోట్లు
బంగారం : 17,25,000, భార్య పేరున : 69,00,000
అప్పులు : రూ.30 లక్షలు, భార్య పేరున : రూ.25 లక్షలు
వాహనాలు : ఇన్నోవా రూ.16 లక్షలు
భార్య పేరున : వోక్సు వేగన్ రూ.4 లక్షలు

భీమవరం : గ్రంధి శ్రీనివాస్ (వైసీపీ)



వయసు : 60
విద్యార్హత : ఇంటర్
చరాస్తులు : రూ.3.44 కోట్లు
భార్య పేరున : రూ. 1.54 కోట్లు
కుటుంబ సభ్యులు : రూ.15.03 కోట్లు
స్థిరాస్తులు : రూ.18.16 కోట్లు
భార్య పేరున : రూ.64.34 లక్షలు,
కుటుంబం : రూ.62.09 కోట్లు
అప్పులు : రూ. 12.20 కోట్లు, భార్య పేరున: రూ.28.95 లక్షలు , కుటుంబం : రూ.57.51 లక్షలు

పాలకొల్లు : నిమ్మల రామానాయుడు (టీడీపీ)



వయసు : 54
విద్యార్హత : ఎంఎ పీహెచ్‌డీ
చరాస్తులు : రూ. 36. 38 లక్షలు
స్థిరాస్థి : 3.16 కోట్లు
భార్య పేరున : 1.17 కోట్లు
స్థిరాస్తి : రూ1.65 కోట్లు
నివాస భవనం విలువ : రూ. 50 లక్షలు
బంగారం : 1130 గ్రాములు
కుమార్తె పేరున : నగదు రూ1.40 లక్షలు డిపాజిట్, 200 గ్రాముల బంగారం. రూ. 51.48 లక్షలు విలువైన 2.86 ఎకరాల భూమి, కుమారుడు పేరున : రూ. 60,400

నూజివీడు : మేకా వెంకట ప్రతాప్ అప్పారావు (వైసీపీ)



వయసు : 73
విద్యార్హత : డిగ్రీ
స్థిరాస్తులు: రూ.20.01 కోట్లు
చరాస్తులు : రూ.47.55 లక్షలు
భార్య పేరున : రూ.44. 87లక్షలు
కుటుంబ సభ్యుల పేరున : రూ.7.64 కోట్లు
రూ.15 లక్షలు విలువచేసే 2015 మోడల్ టయోటా పార్ఛ్యునర్ కారు,రూ.50 వేలు విలువ చేసే మహీంద్రా జీపు.


భారీ ర్యాలీగా పితాని సత్యనారాయణ


బైక్‌లపై ర్యాలీగా వస్తున్న బొలిశెట్టి శ్రీనివాస్

జోరుగా..హుషారుగా

అభ్యర్థుల నామినేషన్లు

జనసంద్రమైన తణుకు పురవీధులు

తణుకు, ఏప్రిల్ 19 : టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ నామినేషన్ సందర్భంగా తణుకు పురవీధులన్నీ కార్యకర్తలు, నాయకులతో కిక్కిరిసిపోయింది. శుక్రవారం ఉదయం ఉండ్రాజవరం రోడ్‌లోని ఆరిమిల్లి నివాసం వద్ద నుంచి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు మధ్య భారీ ర్యాలీ ప్రారంభమైంది. ఆరిమిల్లి ఇంటి సమీపం లోని రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి, పాదయాత్ర హైవే మీదుగా షర్మిష్ట దగ్గర నుంచి వెంకటేశ్వర సెంటర్ మీదుగా రాష్ట్రపతి రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. ముందుగా వేల్పూరు, తణుకులోని పలు దేవా లయాలను సందర్శించారు. శుక్రవారం ఆరిమిల్లి రాధాకృష్ణ, కృష్ణతులసి, తల్లిదండ్రులు చక్రధరరావు, వెంకటలక్ష్మి పూజలు చేశారు. వేల్పూరులోని ఈశ్వరమ్మ ఆలయం, తణుకు వినాయకుని ఆలయం, మండపాకలోని యల్లారమ్మ అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


సైకిళ్లపై ర్యాలీగా వస్తున్న నిమ్మల రామానాయుడు

ఆచంటేశ్వరుని ఆలయంలో పూజలు చేసి..

ఆచంట : ఆచంట నుండి టీడీపీ కూటమి అభ్యర్థిగా పితాని సత్యనారాయణ , వైసీపీ అభ్యర్థిగా చెరుకువాడ శ్రీరంగనాథరాజులు శుక్రవారం తమ నామినేషన్‌లు దాఖలు చేశారు. కొమ్ముచిక్కాల నుంచి కార్యకర్తలతో పెద్ద సంఖ్యలో ర్యాలీగా పితాని ఆచంట వచ్చి నామినేషన్‌లు దాఖలు చేశారు. ముందుగా పితాని మార్టేరులోని వెంకటేశ్వరస్వామి, దుర్గమ్మ ఆలయాల్లో పూజలు చేశారు. ఆచంటలోని ఆచంటేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం వద్దే నామినేషన్‌ల పత్రాలపై సంతకాలు చేసి అనంతరం ఎన్నికల కార్యాలయం వద్దకు వెళ్లి తమ నామినేషన్‌లు దాఖలు చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామ లక్ష్మి , ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాదవ నాయుడు పాల్గొన్నారు.

పూలపల్లి నుంచి నిమ్మల సైకిల్ ర్యాలీ

పాలకొల్లు రూరల్ : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పాలకొల్లు అసెంబ్లీ అభ్యర్థి నిమ్మల రామానాయుడు పూలపల్లి వైజంక్షన్ నుంచి గాంధీబొమ్మలు సెంటరు, పెదగోపురం మెయిన్‌రోడ్డు మీదుగా భారీ సైకిల్ ర్యాలీగా పాలకొల్లు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేశారు. నియోజక వర్గంలోని అన్ని గ్రామాలతో పాటు పట్టణంలోని అన్ని వార్డులు నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సైకిళ్లు తొక్కుకుంటూ భారీగా తరలివచ్చారు. అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. పూలపల్లి నుంచి ప్రారంభమైన సైకిళ్ల ర్యాలీ పట్టణంలో సుమారు 4 గంటల పాటు సాగింది. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, జనసేన రాష్ట్ర ప్రచార విభాగం కన్వీనర్ బన్నీ వాసు, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఉన్న మట్ల కబర్థి, గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, పెచ్చెట్టి బాబు, కర్నేన గౌరు నాయుడు పాల్గొన్నారు.

బొలిశెట్టి భారీ బైక్ ర్యాలీ

పెంటపాడు : తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం కుటుంబ సమేతంగా కే.పెంటపాడు భైరాగిమఠం వేణుగోపాలస్వామి, ఆంజనేస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి , బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు , జనసేన నాయకుడు బొలిశెట్టి రాజేష్‌లతో కలసి వేల మందితో బైక్ ర్యాలీ చేసుకుంటూ కేరళా వాయిద్యాల నడుమ తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. తోటగోపి, కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, దాసరి అప్పన్న, గంధం సతీష్, నరాలశెట్టి సంతోష్‌కుమార్, తనుబుద్ది భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకున్న ఆరిమిల్లి కుటంబ సభ్యులు


భైరాగిమఠం స్వామివారిని దర్శించుకున్న బొలిశెట్టి


ట్రాఫిక్ జామ్‌తో నిలిచిన వాహనాలు

ముహూర్తం దాటిపోయింది..

ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి సమయానికి నామినేషన్ వేయలేకపోయిన అబ్బయ్యచౌదరి

పెదవేగి,ఏప్రిల్ 19 :దెందు లూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అనుకున్న ముహూర్తం ప్రకారం 11.58 గంటలకు నామినేషన్ వేయాల్సి ఉంది. అయితే భారీ ర్యాలీలో చిక్కుకున్న ఆయన ఆ సమయానికి చేరుకోలేకపోవడంతో అబ్బయ్య చౌదరి తండ్రి కొఠారు రామ చంద్రరావు కుమారుని నామినేషన్ పత్రాలను అనుకున్న సమయానికి ఎన్నికల అధికారిణి లావణ్యవేణికి అందించారు. ర్యాలీగా మధ్యాహ్నానికి దెందులూరు చేరుకున్న అబ్బయ్య చౌదరి మధ్యాహ్నం 2.30 గంటలకు తిరిగి మరో సెట్టు నామినేషన్ పత్రా లను ఎన్నికల అధికారికి అందించారు. భారీ ర్యాలీ కారణంగా దారి పొడవునా ట్రాఫిక్ జామవడం ఎండతీవ్రత అధికంగా ఉండడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సుల్లో చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులకు సైతం అవస్థలు తప్పలేదు.

తణుకులో తోపులాట

ఇరగవరం, ఏప్రిల్ 19 : తణుకు నియోజ కవర్గంలో శుక్రవారం ఇరు పార్టీల నాయకులు నామినేషన్లు దాఖలు సమయంలో కొంత ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ అభ్యర్థి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దువ్వ గ్రామం నుంచి పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అదే సమయంలో కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ భారీ జనసందోహం మధ్య నామినేషన్ దాఖలు చేసేందుకు తహసీల్దార్ కార్యా లయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న వైసీపీ నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల నినాదాలతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈనేపథ్యంలో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరగడంతో పోలీసులు జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు.





ప్రత్యర్థులిద్దరూ ఒకరికొకరు షేక్ హ్యాండ్ ఇచ్చి ఆల్‌ది బెస్ట్ చెప్పుకు న్నారు. నరసాపురం వైసీపీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు నామి నేషన్ వేసేందుకు వెళుతుండగా ప్రచారానికి వెళుతున్న జనసేన అభ్యర్థి నాయకర్‌లు శుక్రవారం ఎదురెదురుగా తారసపడ్డారు.

ఆంధ్రజ్యోతి
ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజూ)
డాబా ఇల్లు అమ్మకం
జంగారెడ్డిగూడెం సుబ్బారెడ్డి కాలనీ, ప్రతిభ కాన్వెంట్ వెనకవీధిలో 400 చ.గ.స్థలంలో E/F రెండంతస్తుల డాబా ఇల్లు అమ్మకానికి కలదు., కాంటాక్ట్ నెం: 9441037735.
Ajd:177177
పాఠకులకు ముఖ్య గమనిక
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి



ర్యాలీలో వాహనంపై మాట్లాడుతున్న రోషన్‌కుమార్

చింతలపూడి అభివృద్ధే లక్ష్యం

» చింతలపూడి టీడీపీ కూటమి అభ్యర్థి సొంగా రోషన్

చింతలపూడి, ఏప్రిల్ 19: 'చింతలపూడి అభివృద్ధే నా లక్ష్యం.. గెలిపించుకోవాల్సిన బాధ్యత మీది, అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మాది' అని చింతలపూడి టీడీపీ కూటమి అభ్యర్థి సొంగా రోషన్ అన్నారు. చింతలపూడిలో శుక్రవారం రాత్రి కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన యువజాతర ర్యాలీ హోరెత్తింది. బైపాస్ రోడ్డునుంచి బోయగూడెం షాదీఖానా వైపు యువతీయువకులు నినాదాలు, మూడుపార్టీల జెండాల రెపరెపలు, బాణసంచా కాల్పులతో ర్యాలీ హోరెత్తించారు. బోసుబొమ్మ సెంటర్, ఫైర్‌స్టేషన్ సెంటర్‌లలో ఆయన మాట్లాడుతూ గెలిచిన కొద్దిరోజుల్లోనే చింతలపూడిలో సెంట్రల్ లైటింగ్, నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితిని వెంటనే పరిష్కారం చేస్తానన్నారు. ఎన్‌ఆర్‌ఐగా సంపాదించుకుని వచ్చానని, డబ్బుకోసమో, కమీషన్‌ల కోసమో రాజకీయాల్లోకి రాలేదని అన్నారు. తనతో పాటు ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్‌ను గెలిపించే బాధ్యత యువనాయకులదేనన్నారు. మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ మాట్లాడుతూ ఇటువంటి యువనేతలను గెలిపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, మాటూరి వెంకటరామయ్య, జనసేన నాయకులు చీదరాల మధుబాబు, బీజేపీ నాయకులు తోట వెంకటనారాయణ, దాసరి శ్యామ్‌చంద్రశేషు, పలువురు నాయకులు పాల్గొన్నారు. పలు గ్రామాల నుంచి యువజాతర పేరుతో ర్యాలీలో అధిక సంఖ్యలో యువనాయకులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 19 : గత ఐదేళ్ళుగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ మళ్లీ కోలుకోవాలంటే ఎన్డీఏ కూటమి గెలిచితీరాలని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, గొట్టుముక్కల భాస్కరరావు అన్నారు. గురువారం బుట్టాయగూడెంలోని ఓ కార్యక్రమంలో వారి సమక్షంలో వైసీపీ నాయకుడు గొట్టుముక్కల భాస్కరరావు జనసేనలో చేరారు. కరాటం రాంబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మరికొన్ని కుటుంబసభ్యులు జనసేనలో చేశారు. ఈ సందర్భంగా కరాటం రాంబాబు మాట్లాడుతూ అన్ని స్థాయిల్లో టీడీపీ, బీజేపీ శ్రేణులను కలుపుకుని వెళ్లాలని సూచించారు.



వైసీపీ నేత భాస్కరరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న కరాటం రాంబాబు

చింతమనేనికి మద్దతుగా కుమార్తె నవ్య ప్రచారం

దెందులూరు : విభజన ఆంధ్రప్రదేశ్‌ను గాడిలో పెట్టాలన్నా.. మంచి పరిపాలన కావాలంటే కూటమికి మద్దతు పలకాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె నవ్య అన్నారు. శుక్రవారం పెరుగుగూడెం గ్రామంలో సూపర్ సిక్స్ పథకాలపై కర్ర పత్రాలను పార్టీ గ్రామ అధ్యక్షుడు పావులూరు దశరథరామయ్య, మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనివాసరావు, హేమలత తదితరులు పాల్గొన్నారు.



పెరుగుగూడెంలో అందిస్తున్న చింతమనేని నవ్య ప్రచారం

మాజీ మంత్రి ఇందుకూరిని కలసిన పత్సమట్ల

గణపవరం, ఏప్రిల్ 19: గణపవరం మండలం పిప్పరలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఇందుకూరి రామకృష్ణంరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. అందరికి అండగా ఉంటా.. ఆశీర్వదించండి అంటూ కోరారు.

ముండూరులో టీడీపీ ప్రచారం..

పెదవేగి, ఏప్రిల్ 19 : ఒక్కఛాన్స్ అంటూ అందలం ఎక్కిన జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం ఆర్థికంగా, సామాజికంగా ముప్పై ఏళ్లు వెనక్కి పోయిందని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సతీమణి వెంకటరాధారాణి అన్నారు. ముండూరులో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించారు.

అందరికీ అందుబాటులో ఉంటా : రోషన్‌కుమార్

బుట్టాయగూడెం : టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలందరికీ అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా ముందుంటానని చింతలపూడి ఎన్డీయే అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణ బీజేపీ, పట్టణ టీడీపీ ఆత్మీయ కలయిక సమావేశం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వేమూరి శ్రీనివాస్ నివాసంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణంలో ఉన్న ప్రతి సమస్యపై దృష్టి పెట్టి పరిష్కరిస్తానన్నారు. చింతలపూడిని ఒక రోల్ మోడల్‌గా అభివృద్ధి చేయటమే లక్ష్యమన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు మాట్లాడుతూ సొంగా రోషన్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేమూరి శ్రీనివాస్, పీసుపాటి రామలక్ష్మి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేద్దామన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు మండవల్లి లక్ష్మణరావు, విశ్వహిందూ పరిషత్ నాయకులు కేవీఆర్ సత్యనారాయణ, కొంచాడ దుర్గాప్రసాద్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు తిప్పాభట్ల రామకృష్ణ, చెరుకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెం గ్రామంలో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు.

ఆంథోనినగర్‌లో సమస్యలు పరిష్కరిస్తాం

చింతలపూడి, ఏప్రిల్ 19:ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ శుక్రవారం నగర పంచాయతీలోని ఆంథోనినగర్‌లో ఇంటింటికి వెళ్లి ఓటువేయమని అభ్యర్థించారు. ఆంథోని నగరవాసులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. మా కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కారం చేయాలని ఏకరువు పెట్టారు. రోషన్‌కుమార్ మహిళలతో మాట్లాడుతూ ఆంథోనినగర్‌లో ప్రజల సమస్యలు పరిష్కారం చేస్తానన్నారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్‌కు రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, తాటిసింహా, అప్పారావు, ఎ.శ్రీనివాసరావు, జోజి, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆంథోని నగర్‌లో ప్రచారంలో రోషన్‌కుమార్

ఎన్నికల నిర్వహణ ఖర్చులు నమోదు చేయాలి

చింతలపూడి, ఏప్రిల్ 19: చింతలపూడి అసెంబ్లీ పరిధిలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎన్నికల నిర్వహణ ఖర్చులను కచ్చితంగా నమోదు చేయాలని నియోజకవర్గ నిర్వహణ ఖర్చుల అబ్జర్వర్ శ్రీరామన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలో ఎక్స్‌పెండీచర్స్ స్కీమ్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అభ్యర్థులు పెట్టే ప్రతిఖర్చును బుక్కుల్లో నమోదు చేయాలని, రాజకీయ సమావేశాలు, సభలను నిబంధనల ప్రకారం ప్రతిరోజూ నమోదు చేయాలని సూచనలు చేశారు.

సీనియర్ సిటిజన్స్‌కు హోమ్ ఓటింగ్‌పై అవగాహన

ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 19: అసెంబ్లీ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లంతా తమ ఓటును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ పలు రూపాల్లో ఏర్పాట్లు చేసిందని, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ అధికారిణి రాకాడ మణి తెలిపారు. శుక్రవారం స్థానిక సీనియర్ సిటిజన్‌లకు హోమ్ ఓటింగ్‌పై స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 85 ఏళ్లు దాటిన, దివ్యాంగులైన వారు ఓటుహక్కును వినియోగించుకోవడానికి సీఈసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. ఇంటివద్ద పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటువేసే విధానం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఫారం-డి, ఫారం-13సీపై వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాకాడ మణి

క్రైం వార్తలు

ఆటోను ఢీకొట్టిన బైక్.. మోటారు సైక్లిస్ట్ మృతి

చింతలపూడి, ఏప్రిల్ 19: విద్యార్థులను తీసుకువెళుతున్న ఆటోను ఎదురుగా వేగంగా వస్తున్న మోటారుసైకిల్ ఢీ కొట్టడంతో ఆటోబోల్తా పడిన ఘటన ఆదివారం చింతలపూడి శివారు సమ్మెటవారిగూడెం వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో మోటారు సైక్లిస్ట్ బి.శ్రీను(42) అనేవ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. చనిపోయిన శ్రీను కృష్ణాజిల్లా గంపలగూడెం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఆటోలో పదిహేను మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. గోపాల్‌రెడ్డి అనే విద్యార్థికి రెండుకాళ్ళు దెబ్బతిన్నాయి. ఈ విద్యార్థులను చింతలపూడి ఏరియాఆసుపత్రికి తరలించి చికిత్స జరిపారు. మెరుగైన వైద్యం నిమిత్తం గోపాల్‌రెడ్డిని ఏలూరుకు తరలించారు. ఆసుపత్రిలో జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర, చింతలపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ విద్యార్థులకు ధైర్యం చెప్పారు. ఎస్‌ఐ కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



ఏరియా ఆసుపత్రిలో విద్యార్థితో మాట్లాడుతున్న డీఎస్పీ రవిచంద్ర, సీఐ సుధాకర్

వరికోత యంత్రం బోల్తా.. డ్రైవర్ మృతి

దెందులూరు,ఏప్రిల్ 19:వరి కోత యంత్రం అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఆ డ్రైవర్ యంత్రం కింద పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలివి.. తమిళనాడుకు చెందిన వరి యంత్రంతో పాటు నారాయణ(40) అనే డ్రైవర్ ప్రతి ఏడాది సీజన్‌లో వరి కోతలను కోసి పనులు పూర్తి కాగానే వెళ్లేవాడు. ఈ ఏడాది కూడా సీజన్ ప్రారంభం కాగానే వరి కోతలను ప్రారంభించారు. శుక్రవారం రామారావుగూడెం శివారు మలకచర్లకు చెందిన వరి రైతుల పంటను కోత కోసేందుకు యంత్రంతో మలకచర్ల కొత్తకుంట చెరువు గట్టు మీదుగా వెళ్తుండగా యంత్రం అదుపుతప్పి చెరువులోకి బోల్తా పడింది. డ్రైవర్ యంత్రం కింద పడి మృతి చెందాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారమివ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



బోల్తా పడిన వరి కోత యంత్రం (ఇన్‌సెట్‌లో) నారాయణ మృతదేహం

భార్యకు నిప్పుపెట్టేందుకు యత్నించిన భర్తపై కేసు

భీమడోలు, ఏప్రిల్ 19 : భార్యపై అనుమానంతో ఆమెపై దాడి చేసి ఇంట్లో పెట్టి నిప్పంటించి చంపడానికి ప్రయత్నించిన భర్తపై కేసు నమోదు చేశామని భీమడోలు పోలీసులు తెలిపారు. భీమడోలు గ్రామంలోని హరిజనపేటకు చెందిన దౌలూరి వెంకటలక్ష్మితో దౌలూరి నాగరాజుకు వివాహమైంది. ఒక పాప, బాబు ఉన్నారు. భార్యపై అనుమానంతో భర్త ప్రతిరోజు మద్యం తాగి శారీరకంగా హింసిస్తున్నాడు. పలుమార్లు గ్రామపెద్దల సమక్షంలో గొడవలు సర్దిచెప్పారు. అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈనెల 15వ తేదీన భార్యను కొట్టి.. ఆమెను ఇంట్లో పెట్టి గడియపెట్టి ఇంటికి నిప్పంటించి చంపడానికి ప్రయత్నించినట్టు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎక్సైజ్ దాడులు.. ముగ్గురిపై కేసు

చింతలపూడి, ఏప్రిల్ 19: చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం, తలార్లపల్లి గ్రామాల్లో ఎస్ఈబీ ఆధ్వర్యంలో దాడులు జరిపి, మూడు కేసులు నమోదు చేశామని ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ గణపతిబాబు తెలిపారు. ఆ గ్రామాల్లో 2,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 40 లీటర్ల సారాను, 14 డీపీఎల్ బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. సారా తయారు చేసినా, అక్రమరవాణా చేసినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో స్థానిక ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వి.ఎస్.ఎస్.వి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే వ్యాధులు దూరం

» మలేరియా సహాయ అధికారి గోవిందరావు

పెదవేగి, ఏప్రిల్ 19 : దోమల వ్యాప్తితోనే సకల వ్యాధులు ప్రబలుతాయని, అవగాహనతోనే వ్యాధులను దూరం చేసుకోవచ్చని మలేరియా సహాయ అధికారి జె.గోవిందరావు అన్నారు. పినకడిమిలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. వీధుల్లో పర్యటించి, మహిళలకు పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీటకాల్లో అత్యంత ప్రమాదకరమైనది దోమ అన్నారు. మనరక్తాన్ని తాగి, మనకు ప్రాణాంతకమైన వ్యాధులను సంక్రమింపచేస్తుందని ఆయన చెప్పారు. దోమల నిర్మూలన ఒక సామాజిక బాధ్యతగా తీసుకుని, ప్రతిఒక్కరూ దోమల నిర్మూలనపై ప్రత్యేకదృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఇంటి ఆవరణలో తొట్టెలు, డ్రమ్ములు, పూలకుండీలు, వాడి పడేసిన టైర్లు, ప్లాస్టిక్ గ్లాసులు వంటి వాటిల్లో దోమలు పెరుగుతాయన్నారు. వారానికోసారైనా తొట్టెలను శుభ్రపర్చాలని, వాడని వస్తువులను బోర్లించాలని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రియదర్శిని, హెల్త్ అసిస్టెంట్లు వి.కిశోర్, ఎం.శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్త వెంకటేశ్వరమ్మ, ఆశాకార్యకర్త పద్మ పాల్గొన్నారు.



దోమల వ్యాప్తి అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న గోవిందరావు

ఆర్‌బీకేల్లో 60 వేల గోనెసంచులు సిద్ధం

బుట్టాయగూడెం, ఏప్రిల్ 19 : ఇప్పటివరకు పలు సొసైటీల ద్వారా 60 వేల గోనెసంచులు రైతు భరోసా కేంద్రంలో సిద్ధంగా ఉంచామని, కోతలు పూర్తయిన రైతులు వెంటనే రైతు భరోసా కేంద్ర సిబ్బందికి తెలియజేయాలని జంగారెడ్డిగూడెం మండల వ్యవసాయాధికారి కెవిఎన్ పోశారావు తెలిపారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలను ఆయన పరిశీలించి మాట్లాడారు. వరి కోతలు పూర్తయిన సదరు రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలుకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో రబీ సీజన్‌లో మొత్తం 5,434 ఎకరాల్లో వరి సాగు చేశారన్నారు. దీనిలో 5 వేల ఎకరాలు ఎంటీయూ 1121 కాగా 434 ఎకరాలు పీఆర్ 126 సాగు చేశారన్నారు. ఇప్పటి వరకు పీఆర్ 126 రకం 300 ఎకరాలు, ఎంటీయూ 1121 రకం 400 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలంలో సొసైటీలు, డీసీఎంఎస్‌ల ద్వారా కొనుగోలు ప్రారంభించినట్టు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల కోతలు కోసిన తర్వాత ధాన్యాన్ని ఎక్కువ రోజులు ఆరబెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



జంగారెడ్డిగూడెంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి పోశారావు, సిబ్బంది

మునగలంపాడులో 'ఆరోగ్య సురక్ష'

లింగపాలెం, ఏప్రిల్ 19: మునగలంపాడు గ్రామంలో ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహించారు. కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్థులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. చింతలపూడిలోని సాయిస్ఫూర్తి ఆసుపత్రి వైద్యనిపుణులు పాల్గొన్నారు. రోగులకు వైద్యచికిత్సలు అందించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి అబ్రార్‌హుస్సేన్, ఉమామహేశ్వరరావు, రాణి, చంద్రశేఖర్, హేమలత, ప్రియాంక, జ్యోతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

'బ్రెయిన్ మ్యాపింగ్' అంశంపై అవగాహన

పెదపాడు, ఏప్రిల్ 19 :వట్లూరులోని సర్ సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో 'లెర్నింగ్ స్కిల్స్ బ్రెయిన్ మ్యాపింగ్' అనే అంశం మీద అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మోటివేషన్ సైకాలజిస్టు డాక్టరు ప్రత్యూషా సుబ్బారావు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శైలజ, వెంకటేష్‌గురుజీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కనిపించడం లేదు

కుక్కునూరు, ఏప్రిల్ 19 : కాంగ్రెస్ పార్టీ పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని దువ్వెల సృజన కనపడడం లేదని నియోజకవర్గం ఆ పార్టీ మండల కన్వీనర్‌లు వ్యాఖ్యానించారు. శుక్రవారం కుక్కునూరులో కాంగ్రెస్ పార్టీ ఆరు మండాల కన్వీనర్‌ల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ మరో 20 రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని సృజన ఇంతవరకు మండలాల్లో పర్యటించలేదని, పార్టీ కార్యకర్తలకు పరిచయం కాలేదని, ప్రచారం కూడా చేయడం లేదన్నారు. ఈ విషయంపై జిల్లా అధ్యక్షులకు ఫిర్యాదు చేశామన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఆమెను గెలిపించుకోవాలని తపన తమలో ఉందన్నారు. పార్టీ కోసం విలేకర్ల సమావేశంలో తమ బాధను అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్తున్నామన్నారు. సమావేశంలో ఆరు మండలాల కన్వీనర్‌లు కొల్లూరు సత్యనారాయణ, చిడిపి కుటుంబరావు, గజ్జి రాజులు, అల్లి కిషోర్‌కుమార్, దారం సత్తిరాజు, సాధనాల నరసింహారావు, నాయకులు వడ్డే రఘు, షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల కన్వీనర్లు

అగ్నిప్రమాద బాధితులకు మానవత సాయం

భీమడోలు, ఏప్రిల్ 19 : అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి భీమడోలు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిత్యావసర సరుకులు, కొత్త దుస్తులను పంపిణీ చేశారు. భీమడోలు శివారు అర్జావారిగూడెం ప్రాంతంలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై దౌలూరి ప్రసాద్ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సర్వం కోల్పోయిన ఆ కుటుంబానికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆ కుటుంబానికి బియ్యం, సరుకులు, కొత్త దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో జి.నూకరాజు, పంచగర్ల సత్యనారాయణ, బాబూరత్నం తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

ఆధ్యాత్మికం

సీతారామస్వామి వారి ఊరేగింపు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 19 : జంగారెడ్డిగూడెం సీతారామస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహాఅన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం సాయంత్రం ప్రత్యేక వాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి కేరళ నృత్యం, ఇతర నృత్య కార్యక్రమములతో పలు మేలా తాళాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఈవో ఆకుల కొండలరావు పర్యవేక్షించారు.



జంగారెడ్డిగూడెంలో సీతారామస్వామి వారి ఊరేగింపు

సామూహిక లలితాపారాయణం

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 19. స్థానిక గొల్లాయిగూడెంలోని పంచ ముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మహిళలు సామూహికంగా లలితాపారాయణం భక్తిరంజని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కణితి రాంబాబు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



ఘనంగా శ్రీచక్ర కుంకుమార్చన

ఏలూరుకార్పొరేషన్, ఏప్రిల్ 19. చైత్ర శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్రంపాడులోని అంబికాదేవి అమ్మవారి సన్నిధిలో ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చనలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. తొలుత అమ్మవారికి పంచామృతాభిషేకం జరిపి, విశేష హారతులు ఇచ్చారు. అంబికా కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.

వేణుగోపాలస్వామికి 4 కేజీల వెండి బహూకరణ

నిడమర్రు, ఏప్రిల్ 19 : పెదనిండ్రకొలనులోని శ్రీరాధా రుక్మిణి సమేత వేణుగోపాల స్వామికి గ్రామస్థులు సుమారు నాలుగు కేజీల వెండి ఆభరణాలు శుక్రవారం బహూకరించారు. గ్రామానికి చెందిన దేవస్థానం చైర్మన్ కోడే ఆంజనేయులు ధనలక్ష్మి దంపతులు, కోడే బసన్న శ్రీదేవి, కోడే కాశీవిశ్వనాధ్, చినిమిల్లి నాగవిజయ భ్రమరాంబ గోపాలకృష్ణ దంపతులు, అల్లూరి నాగరాజు, కచ్చాల చంద్రశేఖర సత్యనారాయణ, నక్కా రామకృష్ణ బహూకరించారు. స్వామి వారికి వెండి కిరీటం, కవచం, అభయహస్తం ఆభరణాల రూపంలో అందజేశారు.



నగరేశ్వరస్వామికి కల్యాణ పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 19 : దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని అగ్రహారంలోని నగరేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం కల్యాణ పూజలు ప్రారంభించారు. స్వామి, అమ్మవార్లను పెండ్లి అలంకరణ జరిపి విశేష అర్చనలు జరిపారు. గణపతిపూజ, ధ్వజారోహణం నిర్వహించారు. ఈవో గుబ్బల రామపెద్దింట్లరావు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. 22న స్వామివారి దివ్య కల్యాణం జరిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

బాల వేంకటేశ్వరస్వామి రథోత్సవం

నిడమర్రు, ఏప్రిల్ 19 : నిడమర్రు బాల వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక కల్యాణ మహోత్సవాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్వామి వారి రథోత్సవం పలుర వీధుల మీదుగా వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు స్వామి వారికి తీర్థప్రసాదాలు సమర్పించారు. తొలుత ఉదయం ఆలయ ధర్మకర్త నాయుడు దొరబాబు జయలక్ష్మి దంపతులచే బాలవేంకటేశ్వరస్వామి వారి కల్యాణమహోత్సవం కనుల విందుగా వేదమంత్రోచ్చరణతో సాగింది. కార్యక్రమంలో ఇంటి బాబి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 19: చిన్నారులను భిక్షాటన చేయించటం, పనులకు పంపించడం, తల్లిదండ్రులు వారితో పాటు రోడ్లపైకి తీసుకువచ్చి భిక్షాటన చేయడం నేరమని డీసీపీవో సూర్యచక్రవేణి అన్నారు. శుక్రవారం చిన్నారులతో భిక్షాటన చేస్తున్న తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలను ఎవరైనా సొంత తల్లిదండ్రులు రోడ్లపైకి తీసుకువచ్చి భిక్షాటన చేయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలకు సెలవుల్లో విద్యపై అవగాహన కల్పించాలని, స్కూల్స్ మాన్పించి వీధుల్లో భిక్షాటన చేయించవద్దని హెచ్చరించారు. ఈవిధంగా భిక్షాటన చేస్తున్న పన్నెండు మంది పిల్లలను గుర్తించినట్టు తెలిపారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఆమె సూచించారు.



అవగాహన కల్పిస్తున్న డీసీపీవో సూర్యచక్రవేణి

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

బుట్టాయగూడెం/భీమడోలు, ఏప్రిల్ 19 : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. జంగారెడ్డిగూడెం సాయిదుర్గ హాస్పటల్లో డాక్టర్‌లు, సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. భీమడోలు మండలం భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో భీమడోలు అగ్నిమాపక అధికారి నాగరాజు ఆధ్వర్యంలో ' అగ్నిప్రమాదాల నివారణ చర్యలు, జాగ్రత్తలు' అనే అంశాలపై డెమో నిర్వహించారు. జంగారెడ్డిగూడెం కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ జి.అబ్రహం, ఎల్ఎఫ్ఎం శ్రీనివాస్, ఎఫ్ఎంఎం వి.రమణ, కె.రాజబాబు, వి.నాగరాజు, హెచ్‌జీ మురళీ తదితరులు పాల్గొన్నారు. భీమడోలు కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అగ్ని మాపక అధికారులు పాల్గొన్నారు.

స్టేట్ సెకండ్ ర్యాంకర్ అజయ్‌రాజుకు సన్మానం

ఉంగుటూరు, ఏప్రిల్ 19: రాష్ట్రంలో ఇంటర్ ద్వితీయ పరీక్షలలో జిల్లా ఎనిమిదో ర్యాంకును సాధించడం అభినందనీయమని, మొదటి ఏడాది పరీక్ష ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ఆరో స్థానం వచ్చిందని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న 475 కళాశాలల్లో ఈ కళాశాలకు రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకును (ఎంపీసీ)విభాగంలో సాధించడం పట్ల అభినందించారు. ఈ సందర్భంగా ఇరవై ఏళ్ల క్రితం కళాశాలలో చదివి ఇంటర్‌లో ప్రథమ స్థానం పొందిన కూనా కృష్ణారావుతో పాటు సెకండ్ ర్యాంకర్ అజయ్‌రాజుకు రెండు వేల రూపాయలు అందించి సన్మానించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బి.వి.శ్రీనివాస్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.



అజయ్‌రాజుకు సన్మాన దృశ్యం

తొమ్మిది మంది వలంటీర్ల రాజీనామా

ఉంగుటూరు, ఏప్రిల్ 19 : ఉంగుటూరు మండలంలో శుక్రవారం తొమ్మిది మంది వలంటీర్లు రాజీనామా చేశారు. నారాయణపురంలో ఐదుగురు, కైకరంలో ముగ్గురు, అక్కపల్లిగోకవరంలో ఒకరు రాజీనామా చేశారు.

సీనియర్ కమ్యూనిస్టు నేత రాఘవులు మృతి

చింతలపూడి, ఏప్రిల్ 19: ప్రగడవరం గ్రామానికి చెందిన కాగిత రాఘవులు సీనియర్ కమ్యూనిష్టునేత (74)అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతు న్నారు. పదిహేను రోజుల క్రితం అతడి భార్య గుండెపోటుతో మృతి చెందింది. రాఘవులు గీత కార్మికసంఘానికి సేవలు అందించారు. గ్రామ నాయకులతో పాటు సీపీఎం నాయకులు ఆర్.వి సత్యనారాయణ, కె.చంద్రశేఖర్‌రెడ్డి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. పలువురు జిల్లా నాయకులు సంతాపం తెలిపారు.

టీడీపీ సీనియర్ నేత మీసాల రమేష్ మృతి

చింతలపూడి, ఏప్రిల్ 19: కాంతంపాలెం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, న్యాయవాది మీసాల రమేష్ (42)అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన నియోజకవర్గ టీడీపీకి లీగల్‌సెల్ న్యాయవాదిగా పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. టీడీపీ నియోజకవర్గ నాయకులు జె.ముత్తారెడ్డి, ఎ.శ్రీనివాసరావు, బార్‌అసోసియేషన్ న్యాయవాదులు బలుసు నాగేశ్వరరావు, మన్నెం సత్యకుమార్, డేవిడ్‌రాజు, ఆ కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు.



రమేష్ (ఫైల్)

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 19: స్థానిక అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నేత్ర పరీక్షలు జరిపి దృష్టిలోపం ఉన్న వారికి కళ్ల జోళ్లు అందజేస్తామన్నారు. కంటి శుక్లాలు ఉన్నవారిని గుర్తించి ఆపరేషన్‌లు చేసేందుకు ఎంపిక చేస్తామన్నారు.

మంచినీరు వృథా

ఉంగుటూరు, ఏప్రిల్ 19 : ఉంగుటూరు ఎర్రచెర్వు నుంచి డెల్టా గ్రామాలకు వెళ్లే ప్రత్యేక మంచినీటి పథకం పైపులైను ఉంగుటూరు శివా రులో పశువులు, ట్రాక్టర్ల రాకపోకలతో పగిలిపోయింది. కొన్ని రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. పైపులైను పగిలిపోవడంతో అక్కడ మట్టి, బురద నీరు పైపులైనులో కలసిపోతుంది. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక మంచినీటి పథకం అధికారులు శ్రద్ధ తీసుకుని మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.






మూల్లంక, ఆగిరిపల్లిలో లచ్చన్నకు నివాళులర్పిస్తున్న దృశ్యం

గౌతు లచ్చన్నకు ఘన నివాళి

కలిదిండి, ఏప్రిల్ 19 : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గౌతు లచ్చన్న చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. శుక్రవారం సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతిని పురస్కరించుకుని మూల్లంకలో శెట్టి బలిజ సంక్షేమ సంఘం నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు బండి తులసీరావు, పిల్లి రామకృష్ణ, చింతపల్లి చంద్రరావు, కె. వెంకటేశ్వరరావు, తంగెళ్ల నాగేశ్వరరావు, రంగారావు, పితాని శ్రీనివాసరావు, మామిడిశెట్టి నారాయణ, భోగేశ్వరరావు, జోగి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు లచ్చన్నకు ఘన నివాళులర్పించారు. బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ లచ్చన్న కులవివక్ష, బలహీనవర్గాల అభ్యున్నతికి పోరాడారన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



నూజివీడు టౌన్, ఏప్రిల్ 19: అగ్నిప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నూజివీడు ఫైర్ ఆఫీసర్ కేవీ విశ్వనాథ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించు కుని శుక్రవారం నూజివీడు అమెరికన్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫైర్ సిబ్బంది డి.ముత్తయ్య, డి.పవన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సోమనాద్రిపురం అగ్రహారంలో వలంటీర్లతో వైసీపీ నేతల సమావేశం

రాజీనామా చేయండి..

- వైసీపీ తరపున పనిచేయాలి
- వలంటీర్లపై ఒత్తిడి
- సోమనాద్రిపురంలో రహస్య సమావేశం

మండవల్లి, ఏప్రిల్ 19: వలంటీర్ వ్యవస్థతోనే ఎన్నికల నిర్వహణ చేపట్టాలన్న వైసీపీ ప్రభుత్వం ఆలోచన బెడిసికొట్టడంతో వలంటీర్లను పూర్తిస్థాయిలో ఎన్నికల నిర్వహణలో వినియోగించుకోవాలన్న ఎత్తుగడలో అధికార పార్టీ నేతలు ఉన్నారు. వలంటీర్లు ఎన్నికల నిర్వహణ విధుల్లో పాల్గొనరాదని కోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్నప్పటికీ వారిని వినియోగించుకుని ఎన్నికల్లో లబ్ధి పొందాలని వైసీపీ నేతలు వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నారు. మండవల్లి మండలంలో వలంటీర్ల సమా వేశాన్ని శుక్రవారం మధ్యాహ్నం రహస్యంగా నిర్వహించారు. ఇప్పటికే కొంతమంది వలంటీర్లతో వైసీపీ నాయకులు బలవంతంగా రాజీనామాలు చేయించినప్పటికీ మిగి లిన వారు కూడా రాజీనామా చేసి ఎన్నికల్లో వైసీపీ విజయానికి దోహదపడాలని కొందరు నేతలు ఒత్తిడి చేయడం చర్చనీయంశమైంది. రానున్నది వైసీపీ ప్రభుత్వమ ని, ప్రత్యేక నోటిఫికేషన్‌తో రాజీనామా చేసిన వలంటీర్లు అందర్నీ విధుల్లోకి తీసుకుం టామంటూ హామీ ఇస్తున్నట్లు తెలిసింది. రాజీనామా చేసిన వలంటీర్లకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేసే యోచన ఉన్నట్లు చెబుతున్నారు. వినకపోతే భయపెట్టి రాజీనామా చేయించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇదంతా సమావేశ హాల్‌లో ఒక యువకుడు వీడియో తీస్తుండగా వైసీపీ సర్పంచ్ దాడి చేసినట్లు తెలిసింది.

వలంటీర్లు రాజీనామా చేయవద్దు : కామినేని



భుజబలపట్నంలో కామినేనికి హారతులిస్తున్న మహిళలు

మండవల్లి, ఏప్రిల్ 19: వలంటీర్లను తమ స్వార్థం కోసం వైసీపీ బలి పశువులను చేస్తోందని, కామినేని అన్నారు. మండవల్లిలోని శుక్రవారం కూటమి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ వలంటీర్లతో రాజీనామా చేయించి ఎన్నికల్లో దొడ్డిదారిన పని చేయించుకునేందుకు వైసీపీ నేతలు కుట్ర పన్నారని, వైసీపీ నేతల ఎత్తుగడలను వలంటీర్లు తిప్పి కొట్టాలని, ఎవరూ రాజీనామా చేయవద్దని కామినేని సూచించారు. కూటమి నాయకులు సీఎల్ వెంకట్రావు, నారగాని నాగేశ్వరరావు, చాబత్తిన విజయ్, గుడివాడ చిట్టిబాబు, గుడివాడ బాలాజీ, ముళ్లపూడి సత్తిబాబు, చాపరాల దుర్గాప్రసాద్, బొల్లంపల్లి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు స్వేచ్ఛగా జీవించేలా చూస్తా..

కైకలూరు, ఏప్రిల్ 19: కైకలూరు నియోజకవర్గ ప్రజలు స్వేచ్ఛగా జీవించేందుకు కృషి చేస్తానని కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని భుజబలపట్నం, సీతనపల్లి, సరసాయిపాలెం, గోనెపాడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. తనకు కమలం గుర్తుపై, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతూ నూరురోజులు పనిదినాలు, ప్రతి ఒక్కరికీ జాబుకార్డును అందించి సౌకర్యాలు కల్పిస్తానన్నారు. గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తానన్నారు. భుజబలపట్నంలో మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అతని కుమారుల వేధింపులకు తట్టుకోలేక అనేక మంది భయపడుతున్నారని, భయపడవద్దని తాను అండగా ఉంటానన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, మాజీ జడ్పీటీసీలు ముదునూరి సీతారామరాజు, బొమ్మనబోయిన విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రజకుల సంక్షేమానికి కృషి

టీడీపీలో చేరిన వింజరం వైసీపీ సర్పంచ్

రజకుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తామరకొల్లులో నియోజకవర్గ రజకుల ఆత్మీయ సమావేశాన్ని రజక సంఘ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కామినేని మాట్లాడుతూ రజకులకు అన్ని సంక్షేమ పథకాలతో పాటు దోబీఘాట్లు, కైకలూరులోని రజకుల చెరువును వారికే అందించేలా కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో వింజరం వైసీపీ సర్పంచ్ ధర్మరాజుల నాగమణి, సూర్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో 200 మంది గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు పెద్దఎత్తున కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ భర్తసూర్యనారాయణ మాట్లాడుతూ వైసీపీలో ఇమడలేకపోయామని గ్రామంలో కనీస వసతులు కల్పించడానికి కూడా సహకారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మారుతున్న విషయం తెలిసి గత మూడు రోజుల నుంచి వైసీపీ పెద్ద నాయకులు ఇబ్బందులకు గురిచేశారని కన్నీటిపర్యంతమయ్యారు. బలే ఏసురాజు, సీఎల్ వెంకట్రావు, చందు, రజక సంఘ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే జనరంజక పాలన : సారథి



ప్రజలకు అభివాదం చేస్తున్న నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథి

ముసునూరు, ఏప్రిల్ 19: టీడీపీతోనే జనరంజక పాలన సాధ్యమని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం కొర్లకుంట, సింహాద్రిపురం, చింతలవల్లి, గోగులంపాడు, సాయంత్రం చెక్కపల్లి, లోపూడి, బాసవరపుపాడు గ్రామాల్లో ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. నేలపాటివారికుంట నుంచి టీడీపీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులపాలవడంతోపాటు అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మరలా అధికారం కోసం వైసీపీ నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తూ, ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని, వీరి మాయమాటలు నమ్మవద్దన్నారు. అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. నూజివీడు అభివృద్ధి కోసం తనను గెలిపించాలని పార్థసారథి ప్రజలను అభ్యర్థించారు. గ్రామ, మండల, నియోజకవర్గ టీడీపీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి గెలుపుతోనే రాష్ట్ర భవిత : వంశీ

చాట్రాయి: రాష్ట్ర భవిష్యత్తు కోసం, భావితరాల మనుగడ కోసం ప్రజలు కూటమిని గెలిపించుకోవాలని ఎన్నారై టీడీపీ నాయకుడు బొట్టు వంశీ కోరారు. శుక్రవారం చీపురుగూడెంలో ఆయన ప్రజలతో మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని, అధోగతిపాలైన రాష్ట్రానికి పూర్వవైభవం చంద్రబాబుతోనే సాధ్యం అన్నారు. జగన్ హయాంలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవటంతో రైతులు, కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారన్నారు. 5 ఏళ్ళలో ఒక్క కొత్త పరిశ్రమ రాకపోవటం, ఉన్న పరిశ్రమలను వెళ్ళగొట్టడం వల్ల యువతకు ఉపాధి లేకపోవడంతో పాటు రాష్ట్ర ఆదాయానికి గండి పడిందన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓట్లు వేసి నూజివీడు అసెంబ్లీ అభ్యర్థి కొలుసు పార్థసారథిని, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి మహేష్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

150 కుటుంబాలు టీడీపీలో చేరిక

ముదినేపల్లి రూరల్: కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన 150 కుటుంబాల వారు కైకలూరు పోల్ మేనేజ్‌మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగు యువత అధ్యక్షుడు నాగరాజు, పార్టీ గ్రామ మాజీ అధ్యక్షుడు వీరమల్లు రాంబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి సురేష్, కట్టా సత్యనారాయణ, దాకరం సర్పంచ్ జాస్తి రాజా, తోట వెంకటేశ్వరరావు, వీరమల్లు సుబ్బారావు పాల్గొన్నారు.

అప్రకటిత కోతలు ఎత్తివేయాలి

కలిదిండి, ఏప్రిల్ 19: అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పాలవుతున్నారు. రెండు రోజులుగా గంటల తరబడి అప్రకటిత విద్యుత్ కోత విధిస్తుండటంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. అసలే 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. విద్యుత్ కోతలతో ఫ్యాన్లు, కూలర్లు తిరగక చంటి పిల్లలు, వృద్ధులు, గర్భిణులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వేసవి ప్రారంభంలోనే విద్యుత్ కోత విధిస్తుంటే ముందు ముందు ఇంకా ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తుండటంతో రాత్రి పూట ఇంట్లో ఉక్క పోత, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తేయాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యయ రికార్డుల పరిశీలన



వ్యయ పరిశీలకుడు కీర్తినారాయణ్‌కు ఆర్డీవో స్వాగతం

నూజివీడు, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల్లో నూజివీడు నియోజకవర్గంలో పోటీకి దిగిన అభ్యర్థుల వ్యయాలను ఏలూరు జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు పి.కీర్తినారాయణ్ శుక్రవారం పరిశీలించారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఆయన ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు, నమోదు రికార్డులను పరిశీలించారు. నియోజకవర్గంలో సర్వైలెన్స్ బృందాలు, అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో సమావేశం నిర్వహించి, వ్యయ నమోదు ప్రక్రియ విధానాన్ని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గరిష్ఠ పరిమితికి మించి ఖర్చుచేస్తే ఎమ్మెల్యేగా అనర్హులు అవుతారని, ఎన్నికల వ్యయంపై అభ్యర్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు తదితర అంశాలపై వ్యయాలను లెక్కించే విధానాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు నూజివీడు ఆర్డీవో వై.భవానిశంకరి మొక్క ఇచ్చి స్వాగతం పలికారు. నూజివీడు నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎన్నికల బృందాలు పాల్గొన్నాయి.



చెన్నారావు కుటుంబీకులకు వంశీ పరామర్శ

చాట్రాయి, ఏప్రిల్ 19:ఇటీవల చీపురుగూడెంలో మృతి చెందిన టీడీపీ నాయకుడు చీకటి చెన్నారావు కుటుంబాన్ని శుక్రవారం ఎన్నారై టీడీపీ విభాగం నాయకుడు బొట్టు వంశీ పరామర్శించి, చెన్నారావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న చెన్నారావు ఆకస్మిక మృతి పార్టీకి, పేదలకు తీరని లోటని వంశీ ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నారావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు బొట్టు లక్ష్మణరావు, మందలపు జగదీష్, తమ్మిశెట్టి లక్ష్మణరావు, ఘంటసాల మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించాలి : చైతన్యకృష్ణ

నూజివీడు టౌన్, ఏప్రిల్ 19: ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. నూజివీడు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న మరీదు కృష్ణ పరిచయ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రత్యేక హోదా తీసుకువస్తానన్న జగన్‌రెడ్డి ఢిల్లీ చుట్టూ ప్రదక్షి ణలు చేసి ఏం సాధిం చారో ప్రజలకు చెప్పాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రతాప్ ఐదేళ్ళల్లో నూజివీడుకు చేసిందేమిటో చెప్పాలని ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు చలసాని రామారావు, నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు జి.రాజు, ఎస్ఆర్ హనుమాన్లు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.డి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు మంగినేని రాజీనామా

ముదినేపల్లి రూరల్, ఏప్రిల్ 19: కైకలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మంగినేని బాబ్జి శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన తనను సంప్రదించకుండా ఒక్క రోజులో పార్టీకి వచ్చిన వ్యక్తికి కైకలూరు అసెంబ్లీ టికెట్ ఇవ్వటాన్ని జీర్ణించుకోలేక మనస్థాపంతో పదవికి, కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు బాబ్జి ప్రకటించారు. ఆయనతో పాటు కలిదిండి, మండవల్లి మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు సోము కాశీ విశ్వనాథ్, కేశిరెడ్డి వెంకట శ్రీరామకృష్ణ తమ పదవులకు రాజీనామా చేశారు.

కూటమి అభ్యర్థులకే మాదిగల మద్దతు

చాట్రాయి, ఏప్రిల్ 19: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు కూటమి అభ్యర్థులకే మాదిగలు మద్దతు ఇస్తున్నట్లు నూజివీడు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకుడు వెంపటి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం చాట్రాయి టీడీపీ కార్యాలయంలో జరిగిన మాదిగ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు, కేంద్రంలో మోదీ అధికారంలోకి రాగానే పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత వస్తుందన్నారు. ఎమ్మార్పీయస్ మండల అధ్యక్షుడు మొలుగుమాటి రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమితి నాయకులు పాల్గొన్నారు.

